# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 204 | హైదరాబాద్ | బుధవారం 04-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

పోటీదారులతో పోలిస్తే అమెరికాతో భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించింది: పీయూష్ గోయల్


11లో

హైదరాబాద్...

## రైల్వే హబ్ కాబోతుంది

- వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ అన్న కిషన్ రెడ్డి
- ఉచిత పథకాల కోసమే బడ్జెట్ అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందన్న కిషన్ రెడ్డి

ఈ నెలాఖరులోనే

# రాష్ట్ర బడ్జెట్!

- వారంపాటు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం
- సంక్షేమ పథకాలకు కేటాయింపుపై ఉత్కంఠ
- ఆరు గ్యారెంటీలకు నిధులు దక్కేనా ?
- వ్యవసాయ, విద్య, వైద్య రంగాలకు పెద్ద పీఠ ?
- నిరుద్యోగ భృతికి మొండిచేయేనా ?
- కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు నిరాశే

11లో




ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష

## విజయవంతం..

భారత రక్షణ రంగంలో కీలక ముందడుగు

- ఎస్ఎఫ్‌డీఆర్ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో
- ఒడిశాలోని చాందీపూర్ తీరంలో జరిగిన ప్రయోగం
- సుదూర గగనతల క్షిపణుల అభివృద్ధికి మార్గం సుగమం
- ఈ టెక్నాలజీతో భారత్‌కు పెరగనున్న వ్యూహాత్మక బలం


11లో


11లో

సహనమే భారత్ ను

## గెలిపించిందన్న మోదీ

- అమెరికాతో ట్రేడ్ డీల్ పై స్పందించిన ప్రధాని
- ఎన్ని విమర్శలు వచ్చినా సహనంతో ఉన్నామని వెల్లడి
- వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇదే నిదర్శనమని వ్యాఖ్య

లోక్‌సభలో

## తీవ్ర ఉద్రిక్తత..

8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్



11లో

- బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్
- ఛైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం
- చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం

శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి ..

## విచారణ కమిషన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయం
- సిట్ నివేదిక, ఛార్జ్‌షీట్‌లో తేడాలు ఉన్నట్టు గుర్తింపు
- అసలు వాస్తవాలు తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం


11లో




11లో

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్..

రేపు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు

- రాష్ట్ర అభివృద్ధి, నిధుల సమీకరణే ప్రధాన అజెండా
- అమరావతి, విభజన హామీలపై చర్చించే అవకాశం
- ఐటీ, విద్యా రంగాల విస్తరణపై ప్రత్యేక దృష్టి

భారత శక్తి®
VOICE OF INDIAN

# బంగారం, వెండి ధరలు ఎందుకు తగ్గుతున్నాయి? ఎందుకు పెరుగుతున్నాయి..?

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న తరువాత ఒక్కసారిగా పతనం మొదలైంది. ఆ పతనం ఇంకా కొనసాగుతోంది.ప్రపంచ సంక్షోభం కారణంగా గత సంవత్సరం రికార్డు స్థాయిలను తాకినప్పటికీ, గత మూడు, నాలుగు రోజులుగా బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. తత్ఫలితంగా, ఈ తగ్గుదల సమయంలో బంగారం, వెండిని కొనడం మంచిదేనా లేదా ధరలు మరింత తగ్గే వరకు వేచి ఉండటం మంచిదా అని పెట్టుబడిదారులు ఆలోచిస్తున్నారు. నిజానికి, ఈ వారం రికార్డు గరిష్టాలను చేరుకున్న తర్వాత బులియన్ మార్కెట్లో గణనీయమైన తగ్గుదల డాలర్ బలోపేతం కావడం, అమెరికా ద్రవ్య విధానంపై పెరుగుతున్న అంచనాల కారణంగా నమ్ముతారు. అంతర్జాతీయంగా ఏర్పడిన అస్థిర పరిస్థితుల మధ్య బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితంగా భావించడంతో జనవరిలో పుత్తడి ధరలు కొత్త రికార్డులను తాకాయి.అయితే, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా సెంట్రల్ బ్యాంక్ మాజీ గవర్నర్ కెవిన్ వార్ష్ పేరు ప్రతిపాదించిన తరువాత మార్కెట్లలో లోహాల ధరలు శుక్రవారం పతనం కావడం ప్రారంభమైంది. వార్ష్ పేరును ఫైనాన్షియల్ మార్కెట్లు స్వాగతించాయి. శుక్రవారం అనేక దేశాల కరెన్సీలతో పోల్చినప్పుడు డాలర్ విలువ 1 శాతం పెరిగింది.డాలర్ పుంజుకోవడంతో, 1983 తర్వాత బంగారం ధరల్లో ఒకే రోజు ఈ స్థాయిలో భారీ పతనం నమోదైంది. బంగారం ధర 9 శాతం, వెండి ధర 27శాతం పడిపోయింది.బంగారం, వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం ట్రంప్ పరిపాలన అమెరికా ఫెడరల్ రిజర్వ్ అధిపతిగా కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తుందనే ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఇది వడ్డీ రేటు తగ్గింపు అంచనాలను పెంచింది, ఇది డాలర్, విలువైన లోహాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. ఇంకా, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, దీర్ఘకాలిక విధాన సంకేతాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేశాయి.దేశీయంగా, బడ్జెట్ 2026లో బంగారం, వెండికి సంబంధించి ఎటువంటి ప్రధాన ప్రకటనలు లేవు. దేశీయంగా గట్టి మద్దతు ఇచ్చే ప్రకటలు కూడా లేకపోవడం కూడా మరో కారణం. మార్కెట్లు ఇప్పుడు రాబోయే ఆర్థికగణాంకాలు, యూఎస్ ఉపాధి డేటా, పీఎంఐ డేటాపై దృష్టి సారించాయి, ఇవి ధరలు స్థిరీకరిస్తాయా లేదా మరింత అస్థిరతను చూస్తాయా అని నిర్ణయిస్తాయి.ప్రస్తుతానికి బంగారం, వెండి ధరల్లో అనిశ్చితి కొనసాగుతుందని నిపుణులు భావిస్తున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ విశ్లేషకుడు మానవ్ మోదీ ప్రకారం, రాబోయే కాలంలో ఈ లోహాల ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉండవచ్చు, కాబట్టి పెట్టుబడిదారులు జాగ్రత్తగా ముందుకు సాగాలి. ఇంతలో, ఆదివారం వరుసగా రెండో రోజు కూడా తగ్గుదల కొనసాగింది, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో వెండి ధరలు కిలోగ్రాముకు తొమ్మిది శాతం తగ్గి ?2.65 లక్షలకు చేరుకోగా, బంగారం మూడు శాతం తగ్గి 10 గ్రాములకు ?1.47 లక్షలకు చేరుకుంది.మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (ఎంసీఎక్స్)లో మార్చి నెలలో డెలివరీ చేయాల్సిన వెండి ధర లో సర్క్యూట్‌ను తాకింది. ఏఓ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇఐఐ-కమోడిటీ ఓ కరెన్సీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మీర్ ప్రకారం, దేశీయ మార్కెట్లో బంగారం దాని ఆల్-టైమ్ గరిష్ట స్థాయి నుంచి దాదాపు 20 శాతం తగ్గింది, వెండి దాదాపు 37 శాతం తగ్గింది, ఇది ఇటీవలి లాభాల బుకింగ్, ధరలలో ర్యాలీ తర్వాత సహజ క్షీణతను ప్రతిబింబిస్తుంది.విలువైన లోహాలకు 2025 అద్భుతమైన సంవత్సరంగా నిలిచింది. 1979 తర్వాత బంగారం అత్యధిక వార్షిక లాభాల్ని నమోదు చేసింది.ట్రంప్ సుంకాల భయాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన షేర్ల ధరలు పెరగవచ్చనే అంచనాలమధ్య ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆందోళన ఏర్పడటంతో బంగారం, వెండి ధరలు కొత్త రికార్డుల్ని తాకాయి.బంగారం ధర ఈ ఏడాది జనవరి చివరి నాటికి 5,500 డాలర్లను దాటింది, వెండి ధర కూడా 'ఆల్‌టైమ్ హై'కి చేరింది.2026లో ఫెడరల్ రిజర్వ్ రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని వాల్‌స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ఆకర్షణీయ పెట్టుబడిగా మారుతుంది.బంగారం ధరలు పెరగడానికి మరో పెద్ద కారణం లభ్యత. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ట్రేడ్ అసోసియేషన్ ప్రకారం ఇప్పటి వరకు 216,265 టన్నుల బంగారాన్ని మాత్రమే వెలికి తీశారు.కొన్నేళ్ల క్రితం వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేయడం మొదలు పెట్టడంతో బంగారం ధరలు పెరగడం మొదలైంది.అయితే గత ఏడాది కాలంలో అమెరికా సుంకాల వంటి అంతర్జాతీయ పరిణామాలు బంగారాన్ని మరింత ఆకర్షణీయ పెట్టుబడిగా మార్చాయి.

ఆర్థికపరమైన ఆందోళనలు కూడా బంగారం విలువ పెరగడానికి కారణమైనప్పటికీ, పరిస్థితులు చక్కబడినప్పుడు లేదా లాభాలు చాలని ఇన్వెస్టర్లు భావించినప్పుడు ధరలు అంతే తేలిగ్గా పడిపోవచ్చు.అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. ముడి చమురు ధర 5 శాతానికి పైగా తగ్గింది.ప్రధాన చమురు ఉత్పత్తి సంస్థలు, యథాతథ స్థితిని కొనసాగించాలని నిర్ణయించడం, అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గొచ్చన్న సంకేతాలు వంటివి చమురు ధరలు తగ్గడానికి కారణాలుగా భావిస్తున్నారు.దీంతో పాటు అమెరికా డాలర్ విలువ పెరగడం కూడా చమురు ధరల తగ్గుదలపై ప్రభావం చూపింది.చమురు ధరను డాలర్లలో నిర్ణయిస్తారు. డాలర్ విలువ పెరిగే కొద్దీ అమెరికాయేతర దేశాలకు ముడి చమురు మరింత ఖరీదైనదిగా మారుతుంది.

# దాడుల- ప్రతి దాడుల సంస్కృతా...

విజయవాడ, ఫిబ్రవరి 3, (భారత శక్తి) :

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొన్నేళ్లుగా సాగుతున్న "దాడులు-ప్రతిదాడులు" సంస్కృతిలో ఒక కీలక మార్పు కనిపిస్తోంది. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత జోగి రమేశ్ నివాసంపై జరిగిన దాడి ఉదంతం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే, ఈ ఘటనలో చర్యనీయాంశం దాడి మాత్రమే కాదు.. ఆ దాడి జరిగిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వం స్పందించిన తీరు, తీసుకున్న నిర్ణయాలు విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.టీడీపీ యువనేత, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ గతంలో చేసిన కొన్ని అనుచిత వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ నేపథ్యంలోనే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు టీడీపీ కార్యకర్తలు, నేతలు జోగి రమేశ్ ఇంటిపై దాడికి దిగారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, రాళ్లు రువ్వడం, పెట్రోల్ బాటిళ్లు విసిరి మంటలు రాజేయడం వంటి తీవ్రస్థాయి చర్యలకు పాల్పడ్డారు. ఇది శాంతిభద్రతల పరంగా పెద్ద చర్చకు దారితీసింది.సాధారణంగా అధికార పార్టీ కార్యకర్తలు ప్రతిపక్ష నేతలపై దాడులు చేసినప్పుడు, ప్రభుత్వం వారిని వెనకేసుకొస్తుందనే ముద్ర భారత రాజకీయాల్లో బలంగా ఉంది. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో భిన్నమైన వైఖరిని ప్రదర్శించారు. ఈ దాడి ఘటనను ఆయన తీవ్రంగా పరిగణించడమే కాకుండా, "చట్టం ఎవరికైనా ఒక్కటే.. తప్పు చేసిన వారు మన పార్టీ వారైనా సరే కేసులు నమోదు చేయాల్సిందే" అని పోలీసులను ఆదేశించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు 40 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు చేశారు. వీరిలో 11 మంది కీలక నేతలను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనల ప్రకారం వారికి స్టేషన్ బెయిల్ మంజూరు కావడంతో విడుదలయ్యారు, కానీ చట్టపరమైన ప్రక్రియను మాత్రం ప్రభుత్వం అడ్డుకోలేదు.ఈ ఘటనను విశ్లేషిస్తున్న వారు సహజంగానే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరితో పోల్చుతున్నారు. టీడీపీ నేతలు ప్రధానంగా రెండు అంశాలను ఇక్కడ గుర్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసినప్పుడు, బాధ్యులపై చర్యలు తీసుకోవడం మాట అటుంచి, తిరుగుబాటు చేసిన టీడీపీ నేతలపైనే రివర్స్ కేసులు నమోదయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. గతంలో అసభ్య పదజాలంతో ప్రత్యర్థులను దూషించిన వారికి పదవులు కట్టబెట్టడం ద్వారా వైఎస్సార్‌సీపీ "అరెస్టులు కంటే అభినందనలకే" ప్రాధాన్యత ఇచ్చిందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. దీనికి భిన్నంగా, ఇటీవల వై.ఎస్. భారతిని అసభ్య పదజాలంతో దూషించిన ఐటీడీపీ కార్యకర్తపై చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని, జైలుకు పంపించడం ద్వారా "తప్పు ఎవరి వైపు ఉన్నా క్షమించేది లేదని" సంకేతాలు పంపినట్లయింది.ఒక ప్రభుత్వం తన సొంత కార్యకర్తలపై కేసులు పెట్టడం అనేది రాజకీయంగా సాహసోపేతమైన నిర్ణయమే. దీనివల్ల క్యాడర్‌లో కొంత అసంతృప్తి కలిగే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. "రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ అవి భౌతిక దాడుల వరకు వెళ్లినప్పుడు ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే సమాజంలో అరాచకం పెరుగుతుంది. చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తుంది." అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.జోగి రమేశ్ ఇంటిపై దాడి ఘటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక పాఠంగా నిలిచిపోనుంది. అధికారంలో ఉన్నాం కదా అని చట్టాన్ని అతిక్రమిస్తే, సొంత ప్రభుత్వం కూడా వెనకేసుకురాదని ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. గత ప్రభుత్వ తీరుకు, ప్రస్తుత ప్రభుత్వ జవాబుదారీతనానికి మధ్య ఉన్న ఈ వ్యత్యాసమే తమను ప్రజల్లో మెరుగ్గా నిలబెడుతుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం ఎన్నికల హామీలే కాకుండా, పరిపాలనలో, శాంతిభద్రతల నిర్వహణలో ఇటువంటి కఠిన నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తుకు శుభసూచకం

# లోకల్ బాడీ ఎలక్షన్స్ కు వడివడిగా అడుగులు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 3,(భారత శక్తి) :



ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగనుందా? వరుసగా ఎన్నికలు రానున్నాయా? ముందుగా సర్పంచ్ ఎన్నికలను పూర్తి చేయనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. అయితే రాష్ట్రంలో ముందుగా మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. మార్చి 17తో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. సర్పంచ్ల పదవీకాలం ఏప్రిల్ 4 తో ముగియనుంది. ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీలకు సంబంధించిన పదవీకాలం జూన్ వరకు ఉంది. ఈ తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నీలం సాహ్ని సిద్ధమని ప్రకటించారు. జిల్లా యంత్రాంగాలను సిద్ధం చేశారు. ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల రూపకల్పన వంటివి ఇప్పటికే దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ దూకుడు చూస్తుంటే మే నెలలో పంచాయతీ, అక్కడ కొద్ది రోజులకే మున్సిపాలిటీ, ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలను పూర్తిచేసేందుకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్థమవుతోంది.మరోవైపు స్థానిక పరిస్థితులను చూస్తుంటే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి శాతం ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో పుంజుకోలేదు. ఇటువంటి సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేస్తే.. మూడు పార్టీల మధ్య పదవుల సర్దుబాటు చేస్తే.. వచ్చే మూడేళ్లలో మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేస్తాయి. అందుకే వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మూడు పార్టీల నాయకత్వాలు తమ పార్టీల శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే బలం ఉన్నచోట మాత్రమే అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రజల్లో బలం ఉన్న పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత మాత్రం బలపడకుండా చూడాలని కూటమి భావిస్తున్నట్లు సమాచారం.అయితే ఈనెల 20 తరువాత దేశవ్యాప్తంగా తొలి విడత జన గణన మొదలవుతుంది. సుమారు ఏడాదిన్నర ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ లెక్కన 2027 లోనే ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. అయితే 2018లో చంద్రబాబు చేసిన తప్పిదం అదే. అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చంద్రబాబు ఆసక్తి చూపలేదు. 2019 ఎన్నికల్లో ఆ ప్రభావం కనిపించింది. ఇప్పుడు జనాభా గణ న అంటూ వాయిదా వేస్తే మాత్రం కూటమి పార్టీలకు ఇబ్బంది కరం.. పైగా స్థానిక సంస్థల ఎన్నికలకు కులగణన అనేది అడ్డంకి కాదు. ఎందుకంటే ఆర్థిక సంఘం నిధులన్నీ స్థానిక సంస్థల పాలకవర్గాల తోనే సంబంధం ఉంటుంది. పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. అయితే ఈ పరిణామాలన్నీ చూస్తుంటే మాత్రం వేసవిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఖాయం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# గోన సంచిలో మృతదేహం

కామారెడ్డి ఫిబ్రవరి 3,(భారత శక్తి) :

కామారెడ్డిలో గోన సంచిలో సగం మృతదేహం కలకలం రేపింది. గుర్తు తెలియని దుండగులు ఒక వ్యక్తిని హత్య చేసి ముక్కలుగా చేసి పడేసారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో గోన సంచిలో మనిషి కాళ్లు చూసి చెత్త ఏరుకునే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని చూడగా, గోన సంచిలో నడుము నుండి కాళ్ల వరకు మాత్రమే ఉన్న మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

మిగతా మృతదేహం గురించి వెతికినా దొరకకపోవడంతో, కేసు నమోదు చేసి, మృతుడి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజీనామా

హైదరాబాద్ ఫిబ్రవరి 3,(భారత శక్తి) :

నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణల కుల రాజకీయాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా స్తున్నానని ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు అడ్వకేట్ మల్లెపల్లి జగన్ అన్నారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ మాల కుల రక్షకులుగా, మాదిగ కుల భక్షకులుగా మారారని, వీరి ప్రవర్తనతో విసుగు చెందానని అయన ఆరోపించారు. కల్వకుర్తిలోని ఒక వార్డులో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని ఒక మాల కులస్థుడికి బీ ఫారం ఇచ్చి పార్టీ ఓటమికి కారణమవుతున్నారని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా పార్టీకి సేవలు చేశానని, మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నానని అన్నారు.

==============================

# ఎంపీల పనితీరుపై సమగ్ర నివేదికలు

గుంటూరు ఫిబ్రవరి 3, (భారత శక్తి) :

తెలుగుదేశం పార్టీలో సంస్థాగత క్రమశిక్షణను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగిస్తూ వారి పనితీరును సమీక్షించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు , జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇప్పుడు అదే విధానాన్ని ఎంపీలకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. ప్రజలతో నేరుగా అనుసంధానం పెంచడం, సమస్యల పరిష్కారంలో వేగం తీసుకురావడం ఈ చర్యల వెనుక ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎదురైన సమస్యలు, గత 15 నెలల కాలంలో పరిష్కరించిన అంశాలపై ఎంపీలు సమగ్ర నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని పార్టీ ఆదేశించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఎలా పరిష్కారమయ్యాయి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి ఏవి అనే వివరాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించింది. దీనితో పాటు పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు ప్రస్తావించిన అంశాలు, వాటికి కేటాయించిన సమయం, ఆ చర్చల వల్ల నియోజకవర్గానికి వచ్చిన ప్రయోజనాలు వంటి విషయాలనూ వివరించాలని కోరుతోంది.ఇకపై ఎమ్మెల్యేలతో నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాల మాదిరిగానే ఎంపీలతో కూడా నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశాల్లో ప్రజలతో నాయకులు ఎలా మమేకమవుతున్నారు, క్షేత్రస్థాయిలో వారి పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉంది అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న చొరవ, ప్రజల మధ్య గడుపుతున్న సమయం, పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి విషయాలు ఈ సమీక్షల్లో కీలకంగా మారనున్నాయి.వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల మూడ్ ఎలా మారుతోంది అనే అంశాన్ని కూడా పార్టీ గమనిస్తోంది. అందుకు తగ్గట్టుగా నాయకుల పనితీరును మలచాలనే ఆలోచనతో ఈ సమీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన బాధ్యతలు, సమన్వయం ఉండాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నారు.

నారా లోకేష్ నేతృత్వంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు రూపొందుతున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీలతో ప్రత్యక్ష సమావేశాల ద్వారా వారు ఎదుర్కొంటున్న సంస్థాగత సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. ఈ విధానంతో నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని, నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని ఆశిస్తున్నారు. ఎంపీలను క్రమశిక్షణతో పనిచేసేలా "లైన్‌లో" పెట్టాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకు విజయవంతమవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవుతుందని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# అరకు కాఫీకి సర్కారీ ప్రమోషన్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 3, (భారత శక్తి) :

ఏపీ ప్రభుత్వం కాఫీ రైతులకు శుభవార్త వినిపించింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కాఫీ రైతులకు తీపికబురు వినిపించింది. అల్లూరి జిల్లాలోని గూడెం కొత్తవీధి, జి. మాడుగుల మండలాల్లో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం రూ.7 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. గూడెం కొత్తవీధిలో మెషీన్ల సాయంతో భూమిని చదును చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాఫీ రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగుల, గూడెం కొత్త వీధి మండలాలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎప్పుడో ప్రణాళికలు రచించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ రెండుచోట్లా ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.7 కోట్ల నిధులు విడుదల చేయడంతో పల్పింగ్ కేంద్రాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.మరోవైపు ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు కూడా ఉపయోగిస్తున్నారు. 80 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావటంతో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలయ్యాయి. గూడెం కొత్తవీధిలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రం వద్ద భూమిని చదును చేసే ప్రక్రియ ప్రారంభించారు. యంత్రాల సాయంతో భూమిని చదును చేస్తున్నారు. గూడెం కొత్తవీధిలో పల్పింగ్ కేంద్రం రక్షణ గోడ కోసం రూ.40 లక్షలు ఖర్చు చేస్తున్నారు.మరోవైపు మన్యం ప్రాంతంలో కాఫీ తోటలు సాగు ఎక్కువ. మన్యంలో సుమారుగా రెండున్నర లక్షల ఎకరాలలో కాఫీ పంట సాగవుతోంది. కాఫీ తోటలపై ఆధారపడి లక్షకుపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇక్కడి నుంచి సుమారుగా రూ.200 కోట్ల వరకూ కాఫీ వ్యాపారం జరుగుతోంది

# గేమ్ ఛేంజర్ కాబోతున్న ఎర్త్ కారిడార్

నెల్లూరు ఫిబ్రవరి 3,(భారత శక్తి) :

కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో ఏపీకి గుడ్ న్యూస్ వినిపించింది. ఏపీతో పాటుగా మరో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రేర్ ఎర్త్ కారిడార్ ప్రాజెక్టు ఏపీకి గేమ్ ఛేంజర్ అవుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఏపీలోని కోస్టల్ కారిడార్ వెంట ఉన్న ఖనిజాలు, తీర ప్రాంతం, పోర్టులతో అనుసంధానం.. ఏపీని అరుదైన ఖనిజాల అన్వేషణకు గమ్యస్థానంగా మార్చుతుందంటున్నారు. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నాలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఉంది. దీంతో ఏపీ పాలిట గేమ్ ఛేంజర్‌గా రేర్ ఎర్త్ కారిడార్ మారుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరుదైన భూలోహాలు, ఖనిజాల అన్వేషణకు హబ్‌గా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రభుత్వం నుంచి విధానపరంగా, ఆర్థికంగా సహకారం లభించే అవకాశాలు ఉండటంతో ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఖనిజ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న కోస్టల్ కారిడార్ వెంట ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఖనిజాల అన్వేషణ కోసం చర్యలు మొదలుపెట్టింది. ఇందుకోసం 16 వేల హెక్టార్ల భూమిని కూడా కేటాయించారు. కోస్టల్ కారిడార్ ప్రాంతంలో మోనజైట్, ఇల్మనైట్, రూటైల్, జిర్కాన్, గార్నెట్ వంటి ఖనిజాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. అరుదైన రేర్ ఎర్త్ ఆక్సైడ్లు (55?60 శాతం) థోరియం (8?10 శాతం) అధిక సాంద్రతలో ఉన్నాయంటున్నారు. ఇవి అడ్వాన్స్ టెక్నాలజీకి సంబంధించిన అత్యంత కీలకమైన ముడి పదార్థాలుగా చెప్తున్నారు. మరోవైపు ఖనిజాల అన్వేషణకు సంబంధించి ఇప్పటికే ఓ



ప్రైవేట్ సంస్థకు టెండర్లు కూడా కేటాయించారు. వేయి హెక్టార్ల వరకూ అనుమతి మంజూరు చేశారు. దీనికి అదనంగా మరో నాలుగు వేల హెక్టార్లలో ఖనిజాల అన్వేషణకు కేంద్రం అనుమతి కోరుతున్నట్లు రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. అనుమతులు పొందిన తర్వాత మిగిలిన 11 వేల హెక్టార్లలో కార్యకలాపాలను దశలవారీగా వేగవంతం చేస్తామన్నారు. మరోపైపు ఖనిజాల తవ్వకం, ఎగుమతులు మాత్రమే కాకుండా వాటికి అదనపు విలువను జోడించడం ద్వారా మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న పొడవైన తీరప్రాంతం, పోర్టులతో అనుసంధానం, విస్తరిస్తున్న పారిశ్రామిక కారిడార్లు కూడా రేర్ ఎర్త్ కారిడార్‌కు కలిసివస్తాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిన ఈ రేర్ ఎర్త్ కారిడార్ ఏపీకి గేమ్ ఛేంజర్‌గా అవకాశం ఉందని చెప్తున్నారు.

================

# మళ్లీ పడిపోయిన టమాటా ధరలు

తిరుపతి, ఫిబ్రవరి 3, ( (భారత శక్తి) :

ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి టమాటా ధరలు భారీగా పడిపోయాయి. పంటను మార్కెట్‌లకు తీసుకొచ్చిన రైతులు ధరలు పతనం కావడంతో ఆందోళనలో ఉన్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు టమాటా కోతను వాయిదా వేశారు. రాష్ట్రంలోని మార్కెట్‌లలో మరీ దారుణంగా కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉందని చెబుతున్నారు రైతులు. చాయ్ కంటే చీప్.. కేజీ రూ.10లోపే.. ఇది ఏపీలో టమాటా సాగు చేసిన రైతుల పరిస్థితి. గతేడాది కొన్ని నెలల పాటూ సిరులకు కురిపించి టమాటా ధరలు.. ఇప్పుడు మాత్రం దారుణంగా పడిపోయాయి. మార్కెట్‌లలో కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉంది. ఈ ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటా కోత, రవాణా చేసినందుకు అయ్యే ఖర్చు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను మార్కెట్‌కు తరలించినా ఉపయోగం లేకుండా పోతోంది అంటున్నారు. ఒక్కసారిగా ధరల పడిపోవడంతో ఆందోళనలో ఉన్నారు. అయితే జనాలు మాత్రం టమాటా ధరలు



తగ్గిపోవడంతో పండగ చేసుకుంటున్నారు. జనవరి మొదటి వారంలో టమాటాలు కేజీ రూ.10 నుంచి రూ.20 మధ్య పలికాయి. ఇప్పుడేమో దారుణంగా కేజీ రూ.5 నుంచి రూ.10 మధ్య పలుకుతున్నాయి. అయితే వ్యాపారులు రిటైల్‌గా కేజీ రూ.15 నుంచి రూ.20కు టమాటాను విక్రయిస్తున్నారు. కానీ దారుణంగా రైతుల నుంచి మాత్రం తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట నాణ్యత సరిగా లేకపోవడంతోనే ధరలు తగ్గాయంటున్నారు వ్యాపారులు. మార్కెట్‌కు వస్తున్న సరుకు మొదట్లో వచ్చినంత నాణ్యత లేదని.. అందుకే తిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు. రైతులు మాత్రం వ్యాపారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మార్కెట్లకు వచ్చే టమాటా పంట కూడా తగ్గింది అంటున్నారు. టమాటా ధరలు దారుణంగా పడిపోవడంతో చాలామంది రైతులు కాయల్ని కోసే సాహసం చేయడం లేదు. ఇటీవల టమాటా సాగు చేసిన రైతులది కూడా ఇదే పరిస్థితి. టమాటా సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని.. ఇప్పుడు ధరలు తగ్గడంతో కనీసం ఖర్చులకు కూడా డబ్బులు రావడం లేదంటున్నారు. చాలామంది రైతులు అప్పులబారిన పడుతున్నారట. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధరల దక్కేలా న్యాయం చేయాలని కోరుతున్నారు. కొందరు రైతులు మాత్రం ధరలను చూసి పొరుగు జిల్లాల్లో మార్కెట్‌లకు తరలిస్తున్నారట. అక్కడైనా సరైన దొరకుతుందనే ఆశతో ఇలా చేస్తున్నారట. మొత్తానికి టమాటా ధరలు తగ్గడంతో రాష్ట్రంలో రైతులు కష్టాల్లో ఉన్నారు

# అంబటి వ్యాఖ్యలపై చర్చ...

గుంటూరు ఫిబ్రవరి 3, ( (భారత శక్తి) :

వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల నడిరోడ్డుపై మీడియా ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. సభ్యసమాజం ఆమోదించలేని పదజాలంతో చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. అధికారంలో ఉన్న సమయంలో ఇదే తరహా వ్యాఖ్యలు టీడీపీ నేతల నుంచి వచ్చి ఉంటే ఎలా స్పందించేవారు అన్న అంశం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి జగన్ మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అర్థరాత్రి అరెస్ట్ జరిగిన ఉదంతాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. ఆ సందర్భాన్ని ఇప్పుడు అంబటి వ్యవహారంతో పోలుస్తూ, చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అంబటి వ్యాఖ్యలను సమర్థించే పరిస్థితి వైసీపీలోనే కనిపించడం లేదు. పార్టీ అధినేత తప్ప ఇతర నాయకులు బహిరంగంగా మద్దతు పలకకపోవడం గమనార్హం. వైసీపీలోని పలువురు నేతలు ఆఫ్ ది రికార్డ్‌గా మాట్లాడుతూ, అంబటి మాట తీరు ఎప్పటి నుంచో ఇలాగే ఉందని, గతంలో కూడా అనేకసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. కొందరు నేతలు ఆయన ప్రవర్తన పార్టీకి నష్టం కలిగిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో అంబటి వ్యవహారం వ్యక్తిగత అంశం కాదని, పార్టీ అంతర్గత సమస్యల ప్రతిబింబంగా మారిందనే అభిప్రాయం వినిపిస్తోంది. అసలు అంబటి ఈ స్థాయిలో స్పందించడానికి కారణాలేంటి అన్నది మరో కీలక అంశంగా మారింది. బహిరంగంగా చెబుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆయన కారును అడ్డుకోవడమే కారణం కాదని, వైసీపీలోని కొందరు నాయకులే అంటున్నారు.

# రాజ్యసభ ఆశల పల్లకిలో

విజయవాడ, ఫిబ్రవరి 3 (భారత శక్తి) :

పెద్దల సభ రేసు. ఎవరి ఈక్వేషన్స్ వాళ్లవి. ఒకరు ఏపీ నుంచి ఖాళీ అయ్యే సీట్లలో బెర్త్ కోసం ట్రై చేస్తుంటే..మరొకరు పెద్దల సభలో అడుగు పెట్టి ఏపీలో చక్రం తిప్పాలని స్కెచ్ వేస్తున్నారట. జాతీయ నేతలను కలుస్తూ..ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ రిక్వెస్ట్ చేస్తున్నారట. కానీ ఆ ఇద్దరు రాజ్యసభలో అడుగుపెట్టేందుకు..వాళ్ల పార్టీల్లో పరిస్థితుల్లో అంత ఈజీగా లేవట. మరో మూడు నెలల తర్వాత ఖాళీ కానున్న రాజ్యసభ సీట్లపై ఇప్పటినుంచే ఆసక్తికర రేసు కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా 73 సీట్లు ఖాళీ కానుండటంతో ఏపీకి చెందిన పలు పార్టీల నేతలు లాబీయింగ్‌ను స్పీడప్ చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు రాజ్యసభ సీట్లు మాత్రమే ఖాళీ అవుతున్నాయి. అందులో ఒకటి బీజేపీకి దక్కే అవకాశం ఉండటంతో..బీజేపీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు..రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి బీజేపీలో పలుకుబడి కలిగిన నాయకుడిగా ఉన్న జీవీఎల్ నరసింహారావు..కేంద్ర బడ్జెట్‌పై విస్తృత ప్రచారం చేసేందుకు..దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేటర్ బాధ్యతల్లో ఉన్నారు. ఇదే సమయంలో రాజ్యసభ సీట్లు ఖాళీ కానుండటంతో..పెద్దల సభ బెర్త్‌పై పెద్ద ఆశలే పెట్టుకుంటున్నారట జీవీఎల్. జాతీయ పార్టీ ఆయన సేవలను మరింతగా వినియోగించుకోవాలనుకుంటే ఛాన్స్ ఇవ్వొచ్చని అంటున్నారు. ఏపీ కోటాలో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ సీట్లలో బీజేపీ వాటాగా దక్కే ఒక సీటుని జీవీఎల్‌కు ఇస్తారని టాక్. ఆయనకు అవకాశం ఇస్తే..ఏపీలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందన్న ఈక్వేషన్స్ కూడా ఉన్నాయట. అదే జరిగితే జీవీఎల్ మళ్లీ లైమ్ లైట్‌లోకి వచ్చినట్లే అని అంటున్నారు.

2024 ఎన్నికల్లో విశాఖ నుంచి లోక్ సభకు పోటీ చేయాలని జీవీఎల్ భావించినా ఆ సీటు పొత్తులో టీడీపీకి వెళ్లింది. ఇప్పుడు రాజ్యసభ ఛాన్స్ ఇస్తే జీవీఎల్‌కు రాజకీయంగా దశ తిరిగినట్లే అని అంటున్నారు. అయితే కూటమి నేతలతో జీవీఎల్‌కు ఉన్న సంబంధాల మీదే డిస్కషన్స్ జరుగుతున్నాయ్. అటు సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌తో సహా ఏపీ బీజేపీ నేతలతో కూడా జీవీఎల్‌కు పెద్దగా చెప్పుకోదగ్గ సాన్నిహిత్యం లేదంటున్నారు. బీజేపీ పెద్దలు ఫిక్స్ అయితే మాత్రం జీవీఎల్‌కు బెర్త్ పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైఎస్ షర్మిల కూడా పెద్దల సభలో రేస్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.. ఆమె 2024 జనవరిలో ఏపీ పీసీసీ చీఫ్‌గా పదవిని చేపట్టి..రెండేళ్లుగా ఆ పోస్ట్‌లో కొనసాగుతున్నారు. అయితే కాంగ్రెస్ బలోపేతం కోసం వైఎస్ షర్మిల చేసిన ప్రయత్నాలు ఏవీ పెద్దగా ఫలించలేదు. ఆమెతో పొసగక..కాంగ్రెస్ సీనియర్లు సైలెంట్ అయిపోయారు. వైసీపీ నుంచి ఎవరూ కాంగ్రెస్ వైపు రావడం లేదు. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు షర్మిల. జిల్లాల పర్యటనకు కూడా సిద్ధమవుతున్నారు. ఈ మధ్యే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసిన షర్మిల ఏపీలో పార్టీ పరిస్థితులు, రాజకీయ పరిణామాలపై చర్చించారు. అయితే తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినప్పుడు షర్మిలకు రాజ్యసభ సీటు ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చినట్లు ప్రచారం ఉంది. ఈ మధ్యలో ఒకటి రెండు సార్లు రాజ్యసభకు సీట్లు ఖాళీ అయినా షర్మిలకు బెర్త్ దక్కలేదు. పలువురు ఏపీ కాంగ్రెస్ సీనియర్ నేతలే షర్మిలకు దక్కిన హామీ నెరవేరకుండా అడ్డుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. అయితే రాజ్యసభలో 73 సీట్లు ఖాళీ అవుతున్నా కాంగ్రెస్‌కు దక్కేది తక్కువే అంటున్నారు. ప్రస్తుతం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీకి 27 సీట్లు ఉన్నాయి. 73 మంది సభ్యులు పదవీ



విరమణ చేయనుండటంతో ఆ పార్టీకి ఇంకా సీట్లు తగ్గనున్నాయి. పైగా పదవీ విరమణ చేస్తున్న ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వంటి వారిని తిరిగి కొనసాగించాల్సి ఉంది. ఖర్గేను తెలంగాణ కోటా రాజ్యసభకు పంపిస్తారని ఇన్ సైడ్ టాక్. అయితే కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ఈ మూడూ స్టేట్స్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఈ మూడు రాష్ట్రాల్లో ఏడు సీట్లు ఇక్కడ ఖాళీ అవుతున్నాయి. ఇందులో కాంగ్రెస్‌కు ఐదు కచ్చితంగా వస్తాయి. మహారాష్ట్ర, తమిళనాడు, అసోం వంటి చోట్ల కలుపుకుంటే ఒకటి, రెండు సీట్లు దక్కే అవకాశం ఉంది. కర్నాటక లేకపోతే తెలంగాణ కోటాలో షర్మిలను రాజ్యసభకు పంపించే అవకాశం ఉందట. అయితే తెలంగాణ, కర్నాటక నుంచి రాష్ట్రాల పెద్దల సభలో అడుగుపెట్టేందుకు చాలామంది రేసులో ఉండటంతో షర్మిలకు రాజ్యసభ సీటు దక్కడం అంత ఈజీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ పెద్దలు కనుక షర్మిలకు ఇచ్చినట్లు చెబుతున్న హామీని నిలబెట్టుకోవాలనుకుంటే..ఆమెకు రాజ్యసభ బెర్త్ పక్కా అన్న ప్రచారం జరుగుతోంది. అయితే అటు జీవీఎల్, ఇటు షర్మిల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ అధినాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాలి.

# కొత్త పార్టీల కాలం...

విజయవాడ, ఫిబ్రవరి 3(భారత శక్తి) :

ఏపీలో జాతీయ పార్టీల కంటే ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రాన్ని దశాబ్దాల కాలం ఏలింది. దానికి 1983లో బ్రేక్ పడింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ప్రాంతీయ పార్టీల హవా ప్రారంభం అయింది. కానీ 2014 వరకు ప్రాంతీయ పార్టీగా ఉన్న తెలుగుదేశం వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టు పరిస్థితి ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి, వామపక్షాలు, ఎంఐఎం రాజకీయం చేసేవి. తరువాత కెసిఆర్ నేతృత్వంలోని టిఆర్ఎస్ ఆవిర్భవించింది. చిరంజీవి నేతృత్వంలోని ప్రజారాజ్యం, జయప్రకాష్ నారాయణ నేతృత్వంలోని లోక్సత్తా.. ఇలా చాలా పార్టీలు వచ్చాయి. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో జాతీయ పార్టీలు పక్కకు వెళ్లిపోయాయి. ప్రస్తుతం తెలుగుదేశం, జనసేన, వైయస్సార్ కాంగ్రెస్, బిజెపి క్రియాశీలక పార్టీలు గా ఉన్నాయి. అయితే మరో మూడు ప్రాంతీయ పార్టీలు రానున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే అంతటి స్పేస్ ఏపీ రాజకీయాల్లో ఉంటుందా? అనే ప్రశ్న మాత్రం వినిపిస్తోంది. కానీ అవసరాలు, ఆకాంక్షల కోసం మూడు పార్టీలు ఏర్పాటు అవుతాయని పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది.. అయితే అది కేవలం ప్రచారమా? నిజంగా కార్యరూపం దాల్చే అవకాశం ఉందా? కాలమే నిర్ణయించనుంది. మాజీ ఐపీఎస్ అధికారి ఏపీ వెంకటేశ్వరరావు నూతన రాజకీయ పార్టీ కోసం సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఐఏఎస్ అధికారిగా ఉన్న ఆయన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో తీవ్ర అన్యాయానికి గురయ్యారు. అంతకుముందు చంద్రబాబు ప్రభుత్వానికి ప్రయోజనం కల్పించేందుకు వైసిపికి దెబ్బ కొట్టారని జగన్ అనుమానించారు. అందుకే వైసిపి హయాంలో వెంకటేశ్వరరావును పక్కనపెట్టారు. చివరకు ప్రమోషన్ రోజునే పదవీ విరమణ చేసుకోవాల్సి వచ్చింది. అయితే తనకు నష్టపరిచిన జగన్మోహన్ రెడ్డి విషయంలో కూటమి ప్రభుత్వం మెతక వైఖరి ప్రదర్శిస్తోందని వెంకటేశ్వరరావు లో ఒక బాధ ఉంది. పైగా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆయన ప్రయత్నాలు చేశారని.. వర్కౌట్ కాలేదని ప్రచారం నడుస్తోంది. అందుకే సొంత పార్టీ ఏర్పాటు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా చంద్రబాబు అంటే ఇష్టపడని కమ్మ సామాజిక వర్గం నేతలు, బ్యూరోక్రాసివ్యవస్థలో పనిచేసిన మాజీ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పెడతానని చాలా రోజుల కిందటే ప్రకటించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నెంబర్ 2 నేతగా ఎదిగిన ఆయన పార్టీకి గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వంతో పాటు రాజ్యసభ పదవిని సైతం వదులుకున్నారు. ఆయనకు కూటమి పార్టీలో ఛాన్స్ లేదు. బిజెపిలో చేరే విషయంలో టిడిపి నుంచి అభ్యంతరాలు ఉన్నాయి. అందుకే ఆయన ఇప్పుడు సొంత పార్టీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా సొంత మీడియాను ఏర్పాటు చేసి తర్వాత పార్టీని ప్రారంభిస్తారని సమాచారం. జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని ఇష్టపడని రెడ్డి సామాజిక వర్గం నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే ఇద్దరు అధినేతలను విభేదించే వారితో ఈ రెండు పార్టీల ఏర్పాటుకు రంగం సిద్ధం అవుతుండడం విశేషం.

## మెదక్ లో గులాబీ ఆపరేషన్ ఆకర్ష్..

మెదక్, ఫిబ్రవరి 3 (భారత శక్తి) :

మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్లో చేరికల జోష్ కనిపిస్తున్నది. హస్తం పార్టీ నాయకులు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మళ్లీ అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ పథకాలు అమ లు కావాలన్నా కేసీఆర్ రావాలన్న అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. అందుకు తమ మద్దతు అవసరమని భావిస్తూ.. గులాబీ పార్టీలోకి వస్తున్నారు. మెదక్ జిల్లాలోని మె దక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీ ల నుంచి కాంగ్రెస్ పార్టీ నేత లు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో చేరుతున్నారముున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎన్నికలపై సీరియస్గా దృష్టి సా రించింది. ఇప్పటికే మెదక్ జిల్లా వ్యాప్తంగా వ్యూహాత్మకంగా ప్రణాళికలు రచిస్తోంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు నేతృత్వంలో వరుసగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ప ద్మా దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇం చార్జి, మాజీ ఎశ్రీఇ ఫారూక్ హుస్సేన్ వరుస సమీక్షలతో కేడర్లో జోష్ నింపుతున్నారు. ఈ క్రమంలోనే పట్టణ ప్రాంతాల్లో తన పట్టును నిరూపించుకోవడానికి బీఆర్ఎస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ దూ కుడు ప్రదర్శిస్తోంది. మెదక్ జిల్లాలో నాలు గు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నిక ల్లో తమ మద్దతుదారులు మంచి ఫలితాలు సాధించారని, అదే ఊపును మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు.

# ఎట్టకేలకు ట్రేడ్ డీల్...

## 18 శాతానికి తగ్గనున్న టారిఫ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 ( (భారత శక్తి) :

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ప్రకటించారు. మరోవైపు భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాన్ని అమెరికా 18 శాతానికి తగ్గించిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు.అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ ఇరువురూ ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు.అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని, భారతీయ దిగుమతులపై అమెరికా సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నామని అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు.”భారతదేశంలో తయారైన ఉత్పత్తులపై అమెరికాలో విధించే సుంకాలు ఇకపై 18 శాతానికి తగ్గనున్నాయని తెలిసి నాకు సంతోషంగా ఉంది” అని ప్రధాని మోదీ అన్నారు.”ప్రధాని మోదీపై అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది” అని ఈ ప్రకటన తర్వాత ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. చాలాసార్లు చెప్పినట్లుగా, అధ్యక్షుడు ట్రంప్ నిజంగా ప్రధానమంత్రి మోదీని చాలా మంచి స్నేహితుడిగా భావిస్తారు వాణిజ్య ఒప్పందం వార్తలతో నాకు చాల సంతోషంగా ఉంది. అమెరికా-భారతదేశం సంబంధం అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది” భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇన్‌స్టాగ్రామ్‌లో రాత్రి పోస్ట్ చేశారు.దాదాపు ఏడాదికాలంగా రెండు దేశాల మధ్య సంబంధాలలో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న నేపథ్యంలో సోమవారం రాత్రి రెండు దేశాల అగ్ర నాయకులు చేసిన ఈ ప్రకటన చాలా కీలకంగా మారింది.మొదట విధించిన సుంకాలతో పాటు, రష్యా నుంచి భారత్ చేసే చమురు కొనుగోళ్లపై అమెరికా 25 శాతం సుంకం విధించడంతో మొత్తం 50 శాతానికి చేరుకుంది. భారత ప్రధాని మోదీతో మాట్లాడటం గౌరవంగా ఉంది. ఆయన నా ప్రాణ స్నేహితులలో ఒకరు. తన దేశంలో శక్తివంతమైన, గౌరవనీయమైన నాయకుడు. వాణిజ్యం, రష్యా-యుక్రెయిన్ యుద్ధాన్ని ముగించడం వంటి అనేక అంశాలపై మేము చర్చించాం. రష్యా చమురు కొనుగోలును ఆపివేసి, అమెరికా నుంచి, బహుశా వెనెజ్వెలా నుంచి మరింత చమురు కొనుగోలు చేయడానికి ఆయన అంగీకరించారు”ఇది యుక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని ముగించడంలో సహాయపడుతుంది, ఈ యుద్ధం ప్రతివారం వేలమందిని చంపుతోంది. ప్రధానమంత్రి మోదీ పట్ల స్నేహం, గౌరవం కారణంగా, ఆయన విజ్ఞప్తి మేరకు, అమెరికా, భారతదేశం మధ్య తక్షణమే అమలులోకి వచ్చే వాణిజ్య ఒప్పందానికి మేము అంగీకరించాం. దీని కింద భారతీయ వస్తువులపై సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి అమెరికా తగ్గించింది’’భారత్ కూడా అమెరికాతో తన సుంకాలు, నాన్-టారిఫ్ అడ్డంకులను జీరో చేసే దిశగా ముందుకు సాగుతుంది. “బై అమెరికన్” విధానం కింద అమెరికా నుంచి మరిన్ని కొనుగోళ్లు చేయడానికి ప్రధానమంత్రి మోదీ తన నిబద్ధతను వ్యక్తం చేశారు. ఇందులో 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన అమెరికా ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, బొగ్గు, అనేక ఇతర ఉత్పత్తులు ఉంటాయి””ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేసినప్పుడు, అది మన ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుంది. పరస్పర ప్రయోజనం కోసం అపారమైన అవకాశాలను అందిస్తుంది””ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వం చాలా కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలలో భారత్ ఆయనకు గట్టి అండగా నిలుస్తుంది. మా భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి ఆయనతో కలిసి పనిచేయడానికి నేను ఎదురు చూస్తున్నాను” అని ప్రధాని మోదీ ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

# ఎంఐఎంకు షిఫ్ట్ అవుతున్న ముస్లింలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3, ( (భారత శక్తి) :



భారత దేశంలో దాదాపు అన్నీ సెక్యూలర్ పార్టీలే. బీజేపీ, శివసేన మాత్రమే హిందుత్వ పార్టీలుగా గుర్తింపు పొందాయి. చిన్న పార్టీలు ఉన్నా బలమైన పార్టీలు మాత్రం బీజేపీ, తర్వాత శివసేన. కాంగ్రెస్, ఎస్పీ, త్రుణమూల్ కాంగ్రెస్, ఆప్, సీపీఐ, బీఎస్పీతోపాటు ప్రాంతీయ పార్టీలు లౌకిక పార్టీలుగా చెప్పుకుంటాయి. అయితే ఇప్పుడు ఈ సెక్యులర్ పార్టీలకు కొత్త ముప్పు రాబోతోంది. ఎంఐఎం (అఖిల్ భారత్ మజ్లిస్?ఇ?ఇత్తిహాదుల్ ముస్లిమీన్) సెక్యూలర్ పార్టీలకు భవిష్యత్‌లో చెక్ పెట్టబోతోంది. ఇప్పటికిప్పుడు అధికారం సాధించకపోయినా, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తోంది.కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎంఐఎం మద్దతు కీలకం. కర్ణాటకలో ముస్లిం నాయకులు ఎంఐఎంను పోటీ నుంచి ఉపసంహరించారు. తెలంగాణలో నగరాల్లో అభ్యర్థులు నిలిపి, బీఆర్ఎస్‌కు ఓట్లు వదిలేశారు. కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లో రెండిటిలో ఎంఐఎం సహాయంతోనే గెలిచింది.బిహార్ సిమాంచల్‌లో కాంగ్రెస్ 19 నుంచి 6 సీట్లకు పడిపోయింది. ఎంఐఎం 5 సీట్లు సాధించి సమానంగా నిలిచింది. మహారాష్ట్ర మున్సిపల్‌లో 13 మున్సిపాలిటీల్లో 116 సీట్లు. శంభాజీనగర్‌లో 33, విదర్భ, మారేగావ్‌లో 21, నాందేడ్‌లో 14, ధులేలో 10, షోలాపూర్‌లో 8. ముంబైలో ఎన్సీపీ, ఎంఎన్ఎస్ కంటే ఎక్కువ 8 సీట్లు. సమాజ్‌వాదీ పార్టీ ఒక్క సీటు కూడా లేకుండా పోయింది.ముస్లింలు సెక్యులర్ పార్టీలతో ప్రయోజనం లేదని గ్రహించారు. అందుకే ఆర్జేడీ, జేడీయూ ఓట్లు కోల్పోయాయి. తెలంగాణలో కాంగ్రెస్ బీఆర్ఎస్‌కు ఓటు వెళ్లాయి. గుజరాత్ అహ్మదాబాద్ మున్సిపల్‌లో ఎంఐఎం 4 సీట్లు గెలిచింది.త్వరలో అసోం, బెంగాల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రెండుచోట్ల పోటీ చేయాలని ఎంఐఎం భావిస్తోంది. అసోంలో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌తో చేతులు కలిపేందుకు చర్యలు ప్రారంభించింది. ఇదే జరిగితే ముస్లింలు కాంగ్రెస్‌కు పూర్తిగా దూరమవుతారు. ఇక బెంగాల్‌లో ఇండియన్ సెక్యూలర్ ఫ్రంట్ అనే పార్టీ ఉంది. ఐఎస్ఎఫ్, ఎంఐఎంలు రెండూ చేతులు కలిపే అవకాశాలు ఉన్నాయి. దీంతో లౌకికవాదుల ఓట్లు తగ్గిపోకే అవకాశం ఉంది. ఇక ఉత్తర ప్రదేశ్‌లో గతంలో పోటీచేశారు. ఈసారి చిన్న పార్టీలతో కలిసి పోటీ చేయాలని ఎంఐఎం భావిస్తోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో మజ్లిస్ ఐదారు స్థానాలు గెలిచింది. ఈసారి ఎన్నికల్లో ముస్లిం ఓట్లు ఎంఐఎం సాధించేలా ఒవైసీ ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా ముస్లింలు సెక్యులర్ పార్టీతలో ఎలాంటి లాభం లేదన్నది అర్థమవుతోంది. ఈ భావన ముస్లింలలో బలపడుతోంది. దీంతో ముస్లింలు ఎంఐఎంవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ట్రెండ్ కాంగ్రెస్ ‘సంఘటన్ సృజన్’ ప్రయత్నాలను వృథా చేస్తుంది.ముస్లింలు ఎంఐఎంను ఎంచుకుంటే సెక్యులర్ పార్టీల ఓటుబ్యాంక్ క్షీణిస్తుంది. బీజేపీకి ప్రయోజనం దక్కవచ్చు. ఎంఐఎం గెలుపు రాజకీయ డైనమిక్స్‌ను మార్చే అవకాశం ఉంది.

# ఖమ్మంలో మోడల్ మార్కెట్..

ఖమ్మం, ఫిబ్రవరి 3 (భారత శక్తి) :

ఖమ్మం జిల్లా రైతులకు త్వరలో శుభవార్త అందనుంది. కొత్త మోడల్ మార్కెట్ అందుబాటులోకి రానుంది. గత నెల ఫిబ్రవరి నుంచి నిర్మాణం చేపడుతుండగా.. ఈ నెలలోనే పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. మొత్తం 7 షెడ్లు నిర్మిస్తుండగా.. 5 షెడ్ల నిర్మాణం పూర్తయింది. ఈ నెలాఖరు నాటికి మిగిలిన రెండు షెడ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు.ఖమ్మంలో కొత్త మార్కెట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాత మార్కెట్ స్థానంలోనే షెడ్లను కూల్చివేసి.. రూ.155.45 కోట్లతో 15 ఎకరాల స్థలంలో ఆధునిక వసతులతో కొత్తగా మార్కెట్ ను నిర్మిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత నియోజకవర్గం కావడంతో.. రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్ గా దీన్ని తీర్చిదిద్దాలని ఆయన ప్లాన్ చేశారు. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో నిర్మాణ పనులు ప్రారంభం కాగా.. మొత్తం ఏడు షెడ్లను నిర్మిస్తున్నారు.అయితే ఇప్పటికే 5 షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయగా.. మిగతా రెండు షెడ్ల నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. రైతు పండుగగా భావించే సంక్రాంతి నాటికి కొత్త వ్యవసాయ మార్కెట్ ను పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్లాన్ చేసినా కొన్ని కారణాల వల్ల కుదరలేదు. ఈ మార్కెట్ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ నెలలో మార్కెట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.మిర్చి మార్కెట్ అంటే తెలంగాణలో మొదట గుర్తుకు వచ్చేది ఖమ్మం జిల్లా. ఇక్కడ ధరలు తెలంగాణలో ఎక్కడా లేని విధంగా ఉంటాయి. అంతే కాదు.. మిర్చి పంటను అమ్ముకోవడానికి కూడా రైతులు భారీగా వస్తుంటారు. ఆ మార్కెట్‌కు ఘనమైన చరిత్ర ఉంది. 1937వ సంవత్సరంలో దీనిని ప్రారంభించగా.. ఆ సమయంలో అన్ని రకాల పంటల ఉత్పత్తుల కొనుగోళ్లు, అమ్మకాలు ఇక్కడ ఉండేవి. తర్వాత 1967లో ఈ స్థలంలోనే మిర్చి మార్కెట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అయితే 2017 సంవత్సరంలో ఇక్కడకు సామర్థ్యానికి మించి మిర్చి బస్తాలు రావడంతో.. మార్కెట్లో కాస్త గందరగోళం ఏర్పడింది. పోటెత్తిన మిర్చి కొనుగోళ్లు సరిగ్గా జరగకపోవడంతో కొంత మంది రైతులు మార్కెట్‌ను ధ్వంసం చేశారు.ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని మంత్రి తుమ్మల మార్కెట్‌ను విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌కు తమ ఉత్పత్తులను అమ్మకానికి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కారం చూపాలని మంత్రి భావించారు. దీనిలో భాగంగానే ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి.. మోడల్ మార్కెట్ ప్లాన్ చేశారు. ఒకప్పుడు 80 వేల బస్తాల వరకు సామర్థ్యం ఉండగా.. దానిని రెండు లక్షల బస్తాల వరకు విస్తరిస్తూ నూతన మార్కెట్ నిర్మాణం చేస్తున్నారు.

ఈ మార్కెట్లో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి ఆధునిక గదులు, మూడు టాయిలెట్ బ్లాక్స్, నాలుగు ఆర్వో వాటర్ ప్లాంట్స్ నిర్మాణం చేస్తున్నారు. అంతే కాకుండా.. రైతులు టిఫిన్స్, భోజనం చేసేందుకు క్యాంటీన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ షెడ్ ఏరియా 1.20 లక్షల స్క్వేర్ ఫీట్లు ఉంటే.. దాన్ని 3.50 లక్షల స్క్వేర్ ఫీట్లకు పెంచనున్నారు.

# బల్లెంగా మారుతున్న అర్జున్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3, (భారత శక్తి) :

అర్జున్. ఆకాశం లో అలుపు అనేది లేకుండా తిరుగుతుంది. తన చూపుతో ఎంతటి చిన్న వస్తువునైనా కనిపెడుతుంది. అది ప్రమాదకరం అని తెలిస్తే వెంటనే నాశనం చేస్తుంది. చూసి రమ్మంటే కాల్చివచ్చి బూడిదను తీసుకొస్తుంది. అలాగని ఇదేమి యుద్ధ విమానం కాదు. ఫైటర్ జెట్ కాదు. ఇంతకీ ఇదేంటంటే..పూర్వకాలంలో యుద్ధాలు చేస్తున్నప్పుడు పక్షులను కూడా వాడుకునేవారు. పక్షుల ద్వారా వర్తమానాలు మాత్రమే కాదు.. శత్రువుల సంబంధించిన స్థావరాలను కూడా గుర్తించేవారు. ఆ స్థావరాలను పక్షుల ద్వారానే నాశనం చేయించేవారు. అప్పట్లో ఆ కాలంలో ఆధునికమైన విమానాలు లేవు కాబట్టి రాజులు పక్షులను తమ యుద్ధ తంత్రాలుగా.. యుద్ధానికి ఉపయోగపడే వస్తువులుగా వాడేవారు.నేటి ఆధునిక కాలంలో అత్యంత సామర్థ్యం ఉన్న విమానాలు.. డ్రోన్లు.. ఇంకా చెప్పాలంటే రకరకాల జెట్ లు యుద్ధాలలో పాలుపంచుకుంటున్నాయి. అయితే ఈ కాలంలో కూడా పక్షులను యుద్ధ రీతులలో.. శత్రువుల స్థావరాలను కనుక్కోవడంలో ఉపయోగిస్తున్నారు. అయితే ఇందులో మన దేశం కూడా ఉంది. మన దేశానికి సంబంధించిన గూడచారి వ్యవస్థ ఒక గద్దను ఏజెంట్ గా వాడుకుంటున్నది. సహజంగా గద్దలు గూడచారులుగా వ్యవహరిస్తుంటాయి. వాటికి సరైన శిక్షణ ఇస్తే ఎలాంటి పని అయినా సరే చిటికెలో చేస్తాయి.మన దేశ గూడచారి వ్యవస్థ శిక్షణ ఇచ్చిన గద్ద పేరు అర్జున్. ఇది దేశ సైనిక వ్యవస్థకు అండగా ఉంటున్నది. శత్రువుల స్థావరాలపై కన్నేస్తుంది. శత్రువుల కదలికలను నిత్యం కనిపెడుతూనే ఉంటుంది. డ్రోన్లను గుర్తించి నిర్వీర్యం చేస్తుంది. దీనిని మనదేశ గూడచారి వ్యవస్థ ఆకాశరాజు అని పిలుస్తోంది. ఇలాంటి గద్దలు మన దేశ గూడచారి వ్యవస్థ వద్ద చాలా ఉన్నాయి. అయితే అందులో ఎలక్ట్రానిక్ సదుపాయాలు ఉన్న గద్ద మాత్రం అర్జున్ ఒక్కటే. ఇది సరిహద్దుల వెంబడి ప్రయాణిస్తూ ఉంటుంది. ఆకాశమార్గంలోనే శత్రువుల స్థావరాలను పసిగడుతూ ఉంటుంది. శత్రువులు వదిలిపెట్టే డ్రోన్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తుంది. మనదేశ గూడచార వ్యవస్థకు చేరవేరుస్తూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో వాటిని నిర్వీర్యం చేసి.. కూల్చివేస్తుంది. ముఖ్యంగా సరిహద్దుల్లో తీవ్రవాదులు చొరబాట్లకి ప్రవేశించినప్పుడు.. అర్జున్ పసిగడుతుంది.. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సైన్యానికి చేరవేరుస్తుంది.

# ట్రంప్ అభిశంసన...?

న్యూయార్క్, ఫిబ్రవరి 3



అగ్రరాజ్యం అమెరికాలో ఆ దేశ అధ్యక్షుడిపై ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోంది. ఏడాదిలోనే ట్రంప్ గ్రాఫ్ గతంలో ఎరికీ లేనంతగా పడిపోయింది. మరోవైపు న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ట్రంప్ బలపర్చిన అభ్యర్థి ఓడిపోయారు. ఇక ట్రంప్ పాలనలో ఇప్పటికే నెలరోజులు షట్‌డౌన్ అయిన అమెరికా మరోమారు అదే ప్రమాదం అంచున ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు డొనాల్డ్ ట్రంప్‌పై మరో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మార్చి 31 లోపు దీన్ని సాధించాలని ప్రణాళిక రూపొందించారు. అల్ గ్రీన్ వంటి నేతలు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.రెండో మారు అధికారంలోకి వచ్చిన ట్రంప్ చర్యలు, తీసుకుంటున్న నిర్ణయాలు, రూపొందిస్తున్న చట్టాలు ఏవీ ప్రజామోదయోగ్యంగా ఉండడం లేదు. అక్రమ వలసదారులపై దళాలు, మిన్నెసోటా కాల్పుల ఘటనలు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వైఫల్యాన్ని హైలైట్ చేశాయి. సుంకాల వల్ల ధరల ఆకాశంగమనం చిన్న వ్యాపారాలు, పౌరుల్లో అసంతృప్తి పెంచింది. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైయ్యేందుకు ట్రంప్ ప్లాన్ చేస్తున్నారని, రాజ్యాంగం సవరించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.రిపబ్లికన్ ఆధిపత్య సభలో డెమోక్రాట్లు మెజారిటీ లేకపోవడంతో, పార్టీలోని ట్రంప్ వ్యతిరేకుల మద్దతు కోరుతున్నారు. ట్రంప్ చర్యలు స్వంత పార్టీలో కూడా అసహనాన్ని రేకెత్తిస్తోంది. దీంతో అభిశంసనకు రిపబ్లికన్ సభ్యులు మద్దతు ఇస్తారని భావిస్తున్నారు. ఈ అభిశంసనను 2026 మధ్యంతర ఎన్నికలకు ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. ట్రంప్ అధికారంతో ఎన్నికలపై ప్రభావం చూపించకుండా ఆపాలని భావిస్తున్నారు. మరోవైపు ట్రంప్ తన సపోర్టర్లను అప్రమత్తం చేస్తూ, మెజారిటీ కోల్పోతే ప్రతీకార చర్యలు తీసుకుంటారిని భావిస్తున్నారు.ప్రతినిధుల సభలో తీర్మానం ఆమోదమైనా, సెనెట్‌లో రిపబ్లికన్ బలంతో ట్రంప్ పదవి కోల్పోయే అవకాశం తక్కువ. అయితే, ఈ రాజకీయ రచ్చ ట్రంప్ ఇమేజ్‌ను దెబ్బతీస్తుంది. లేదా పార్టీలో చీలిక తెస్తుంది. మార్చి 31 డెడ్‌లైన్ ఒత్తిడి పెంచే ఎత్తుగడగానే కనిపిస్తోంది

# రెబల్స్...బుజ్జగింపులు...

అదిలాబాద్, ఫిబ్రవరి 3, (భారత శక్తి) :

ఆయా పార్టీల నుంచి బరిలో నిలిచేందుకు బీ ఫారంలు అందజేసేందుకు ఈ నెల మూడవ తేదీ ఆఖరు కాగా, అభ్యర్థి నామినేషన్ విత్ డ్రా చేసుకునేందుకు మద్యాహ్నం మూడు గంటల వరకే సమయం ఉండటంతో రెబల్స్ తో ఇబ్బందులు పడుతున్నవారంతా ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మంచిర్యాల కార్పొరేషన్ తో పాటు లక్షెట్టిపేట మున్సిపాలిటీల కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను వెల్లడించగా, బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీల అభ్యర్థులను ఆయా నియోజక వర్గ ఎంఎల్ఏలు ఇంత వరకు ప్రకటించలేదు. అలాగే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సైతం అభ్యర్థుల పేర్లు అన్నింటిలో పూర్తి స్థాయిలో ప్రకటించాల్సి ఉంది.అయితే పార్టీ బీ ఫారంలు సమర్పించిన అనంతరం ఎంత మంది పార్టీ నుంచి బరిలో ఉంటారు, ఎంత మంది విత్ డ్రా చేసుకుంటారో, ఇండిపెండెంట్లుగా బరిలో ఎందరు నిలుస్తారో తేలనుంది. అయితే అభ్యర్థులను విత్ డ్రా చేయించి తమకు మద్ధతు తెలుపాలని, ఇందు కోసం లక్షల్లో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే ఈ సారి బరిలో లేకుంటే తర్వాత తమకు అవకాశం రావడం కలేనని, ఏదీ ఏమైనా బరిలో నిలుచునుడే.., సామర్థ్యం పరీక్షించుకునేడే అనే ధోరణితో రెబల్స్ ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మధ్యవర్తిత్వం ఫలిస్తుందా..! విఫలమవుతుందా..! అనేది వేచి చూడాల్సిందే...జిల్లాలో 149 డివిజన్, వార్డులకు 1061 మంది అభ్యర్థులకు చెందిన 1177 నామినేషన్లు ఆమోదం పొందగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల నుంచి అధిక సంఖ్యలో ఆశాపడుతున్నట్లుంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లకు కాంగ్రెస్ నుంచి 77 నామినేషన్ లు, బీఆర్ఎస్ నుంచి 98, బీజేపీ నుంచి 108, బెల్లంపల్లి మున్సిపాలిటీ లోని 34 వార్డులకు కాంగ్రెస్ నుంచి 123, బీఆర్ఎస్ నుంచి 81, బీజేపీ నుంచి 27, చెన్నూర్ మున్సిపాలిటీ లోని 18 వార్డులకు కాంగ్రెస్ నుంచి 56, బీఆర్ఎస్ నుంచి 36, బీజేపీ నుంచి 24, క్యాతనపల్లి మున్సిపాలిటీ లోని 22 వార్డులకు కాంగ్రెస్ నుంచి 88, బీఆర్ఎస్ నుంచి 53, బీజేపీ నుంచి 33, లక్షెట్టిపేట మున్సిపాలిటీ లోని 15 వార్డులకు కాంగ్రెస్ నుంచి 25, బీఆర్ఎస్ నుంచి 32, బీజేపీ నుంచి 25 నామినేషన్లు వచ్చాయి. ప్రతీ పార్టీ నుంచి డివిజన్ లు, వార్డులకంటే నామినేషన్లు అధికంగా ఉండటంతో ఎవరికి బీ ఫాం వస్తుంది, ఎంత మంది విత్ డ్రా అవుతారు, ఇండిపెండెంట్లుగా ఎంత మంది బరిలో నిలుస్తారోననే ఉత్కంఠ నెలకొంది.

డబ్బులే సర్వే

ప్రజాదరణ ఉన్న... గెలిసే సత్తా చూపిన... సరిపడ సొమ్ము ఉంటేనే బి ఫారం అనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపాలిటీలలో ఎన్నికలవేళ రాజకీయ వాతావరణం హీటెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేయాలనుకున్న ఆశావాహులకు సర్వేభయం పట్టుకుంది.క్షేత్రస్థాయిలో ప్రజల మన్ననలు ఉన్నప్పటికీ సరిపడ నిధులు సమకూర్చ గల వారికే బి ఫారాలు దక్కుతాయని ప్రచారంతో ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్టీని అంటిపెట్టుకొని ప్రజా సమస్యలతో నిత్యం ప్రజల మధ్య ఉన్నప్పటికీ డబ్బులు లేకపోవడంతో అభ్యర్థులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో మేయర్, చైర్మన్ పదవులకు డిమాండ్ పెరిగింది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి దక్కించుకోవాలంటే రూ 10 నుంచి 15 కోట్లు, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపల్ చైర్మన్ పదవులకు రూ.2 నుంచి 3 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉండాలంటూ ప్రధాన ప్రార్టీలు చెబుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.ఉన్నత పదవులే కాకుండా కార్పొరేటర్, కౌన్సిలర్ టిక్కెట్ల కోసం అభ్యర్థులు పెద్ద మొత్తంలో డిపాజిట్లను చూపాల్సి వస్తోంది. ఒక్కొక్క డివిజన్ నుంచి పోటీ చేయాలంటే రూ 25 నుంచి 35 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతలు స్పష్టం చేస్తున్నారు. డబ్బులు లేని కార్యకర్తలకు టిక్కెట్లు దక్కే అవకాశం లేదంటున్నారు. రాజకీయ సిద్ధాంతాలతో సంబంధం లేకున్నా ఆర్థిక స్తోమత చాలినంత ఉంటే వారికే పార్టీలు పెద్దపీట వేయటం మాజీ ప్రజాప్రతినిధులకు మింగుడు పడటం లేదు.ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతి వార్డు, డివిజన్లో సర్వేలు నిర్వహించి గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఆర్థిక బలం ఉంటుందో వారికే టిక్కెట్లు కేటాయించే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలు బహు ఖరీదుగా మారాయి.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విస్తృత బందోబస్తు

మేడ్చల్, ఫిబ్రవరి 03(భారత శక్తి):

రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం యెల్లంపేట్, రావల్కోల్, రాజబొల్లారం తండా మున్సిపాలిటీ పరిధిలో విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

ఇందులో భాగంగా మేడ్చల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, దుండిగల్ పోలీస్ సిబ్బంది, జోనల్ ఫోర్స్‌తో కలిసి రావల్కోల్ గ్రామ పరిధిలో వాహనాల తనిఖీలు, ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని పేర్కొన్నారు.



ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు విజిబుల్ పోలిసింగ్ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# 8వ చెల్పూర్ గ్రామ పంచాయతీ లో సీఎం సభ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : కల్లెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి జిల్లా (భారత శక్తి) ఫిబ్రవరి 3: మంగళవారం ఎస్పి సంకీర్త్ తో కలిసి 8వ తేదీన చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రామప్ప కాలనీ ఎదురుగా ఉన్న స్థలంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సంకీర్త్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా స్థలం, వీఐపీ గ్యాలరీ, ప్రజల కోసం ఏర్పాటు చేయనున్న గ్యాలరీ, పార్కింగ్, రహదారి సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా, సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ, భద్రతా పరంగా పటిష్ట చర్యలు



తీసుకుంటున్నామని, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, ఆర్ అండ్ బి ఈఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు స్థిర ఆదాయానికి సమీకృత వ్యవసాయమే ఉత్తమ మార్గం: కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 03(భారతశక్తి): రైతులకు స్థిరమైన, నిరంతర ఆదాయం సాధించేందుకు సమీకృత వ్యవసాయ విధానం ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు గ్రామంలో రైతు పడిగా ప్రశాంత్ ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అమలు చేస్తున్న సమీకృత, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఆయన పరిశీలించారు. ఈ సమీకృత వ్యవసాయ కేంద్రంలో ఆకుకూరలు,



మునగతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలను పూర్తిగా డ్రిప్ ఇరిగేషన్ విధానంలో సాగు చేస్తున్న తీరును కలెక్టర్ ప్రశంసించారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నందుకు రైతు పడిగా ప్రశాంత్‌ను అభినందించారు. అలాగే యూనిట్‌లో కొనసాగుతున్న కొర్రమీను చేపల పెంపకం, మేకల పెంపకం, బ్యాక్‌యార్డ్ మదర్ యూనిట్, డక్స్ యూనిట్‌లను కూడా పరిశీలించి, వాటి నిర్వహణపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ తరహా సమీకృత వ్యవసాయ యూనిట్లు జిల్లాలోని ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ అన్నారు. అనంతరం మైలవరం గ్రామంలో రైతు మాడె కృష్ణవేణి ఏర్పాటు చేసిన కౌజు పిట్టల యూనిట్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ యూనిట్‌ను కేవలం రూ.25 వేలు తక్కువ పెట్టుబడితో షెడ్ నిర్మాణం, ఫెన్సింగ్, కౌజు పిల్లలు, ఫీడ్ అవసరమైన పరికరాలతో ఏర్పాటు చేసిన విధానాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. తక్కువ పెట్టుబడితో గ్రామీణ మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఈ యూనిట్లను జిల్లాలో విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని , జిల్లాలో ఈ విధంగా 500 కౌజు పిట్టల యూనిట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మైలవరశీ గ్రామానికి చెందిన యువ రైతు కుంజా సందీప్ అమలు చేస్తున్న ప్రకృతి సేంద్రియ వ్యవసాయ విధానాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. అనేక రకాల సమీకృత పంటల సాగుతో పాటు జీవామృతం, పంచగవ్య వంటి సేంద్రియ ఎరువుల తయారీ యూనిట్లను పరిశీలించి, సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరిగి, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా యువ రైతు కుంజా సందీప్‌ను కలెక్టర్ అభినందిస్తూ, సేంద్రియ సాగును మరింత విస్తృతంగా చేపట్టాలని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ గ్రామంలోని యువ రైతులకు సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు సుజాతనగర్‌లోని రవి హైబ్రిడ్ సీడ్స్ కేంద్రాన్ని సందర్శించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, సమీకృత వ్యవసాయ విధానం రైతులకు స్థిరమైన, నిరంతర ఆదాయాన్ని అందించే ఉత్తమ మార్గమని తెలిపారు. ఒకే వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగుతో పాటు పశుపోషణ, పక్షుల పెంపకం, చేపల పెంపకం వంటి అనుబంధ కార్యకలాపాలను సమన్వయంతో చేపట్టడం వల్ల సాగులోని ప్రమాదాలు తగ్గి లాభాలు పెరుగుతాయని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగునీటి పద్ధతుల వినియోగంతో నీటి వృథా తగ్గి దిగుబడులు మెరుగుపడతాయన్నారు. తక్కువ పెట్టుబడితో కౌజు పిట్టల యూనిట్లు, బ్యాక్‌యార్డ్ యూనిట్లు, సేంద్రియ వ్యవసాయం వంటి కార్యక్రమాలు గ్రామీణ యువత, మహిళలకు మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. జిల్లాలో ఈ తరహా మోడల్ యూనిట్లను విస్తృతంగా ఏర్పాటు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకయ్య, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్ - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.

భూపాలపల్లి జిల్లా (భారత శక్తి) ఫిబ్రవరి 3:

పంచాయతీ ఎన్నికల ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పుల్ల మహేష్ 29 వార్డు న్యూ సుభాష్ కాలనీ సీపీఐ మరియు సీపీఐ(యం) పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పుల్ల మహేష్ గెలుపు కొరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, సీపీఐ(యం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ముఖ్య నాయకులు మరియు ఆయా వార్డుల ఎన్నికల ఇంచార్జీ లతో కలిసి ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులల్లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం నిరంతరం కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# గంటల వ్యవధిలో చిన్నారుల ఆచూకీ లభ్యం -ఇంటి నుంచి పారిపోయిన ఇద్దరు చిన్నారులు క్షేమం

జీడిమెట్ల, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 3: ఇంటి నుంచి పారిపోయిన చిన్నారులను జీడిమెట్ల పోలీసులు గంటల వ్యవధిలో సురక్షితంగా రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

జీడిమెట్ల ఇన్ స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం నిన్న అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో నరేష్ అనే వ్యక్తి వచ్చి తన ఇద్దరు పిల్లలు కనిపించట్లేదని జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాత్రి విధుల్లో ఉన్న ఎస్సై నాయుడు, కానిస్టేబుల్ నరేష్ సాంకేతికత సాయంతో చిన్నారులను గుర్తించి ఈరోజు తెల్లవారుజామున వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల సత్వర స్పందనకు కుటుంబ సభ్యులు, కాలనీవాసులు అభినందనలు తెలిపారు.




# ఇంటింటి ప్రచారంలో 12 వార్డు కౌన్సిలర్ బిజెపి అభ్యర్థి రాము సాహితి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 3

సంగారెడ్డి మున్సిపాలిటీలో ఎన్నికల హడావుడి ఊపందుకుంది. మున్సిపాలిటీలోని 12వ వార్డు బిజెపి బలపరిచిన అభ్యర్థి రాము సాహితీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 12వ వార్డు అభివృద్ధి చేసి చూపిస్తానని ఓటర్లకు వివరించారు. వార్డు అభివృద్ధికి స్వచ్ఛందంగా కృషి చేస్తానని అన్నారు. కాలనీవాసులో తన ప్రచారానికి సహకరిస్తున్నట్లు తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు, వైసీపీ అహంకారానికి నిదర్శనం - పోరుమామిళ్ల మండలం టీడీపీ అధ్యక్షులు నగిరి భైరవ ప్రసాద్

పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 03: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని పోరుమామిళ్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నగిరి భైరవ ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యంలో పదవుల గౌరవం, వ్యక్తుల మర్యాద కాపాడటం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసంతో రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన రాజకీయ పద్ధతి కాదని ఆయన అన్నారు. రాజకీయ విమర్శలు వేరే, వ్యక్తిగత దూషణలు వేరే అని స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు తమ వైఫల్యాలను దాచిపెట్టేందుకు ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలు ఇప్పటికే వారి తీరును గమనించారని, సమయానుకూలంగా తీర్పు కూడా ఇస్తారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి గౌరవాన్ని దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలకు అంబటి రాంబాబు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో EPTS విధానం అమలు కావాలి

కడప, ఫిబ్రవరి 3(భారత శక్తి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈపీటీఎస్ (ఎలెక్ట్రానిక్ పర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్) విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టరేట్ లోని అన్ని విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బందికి ఈపీటీఎస్ (ఎలెక్ట్రానిక్ పర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్) నిర్వహణపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ఎన్ఐసి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈపీటీఎస్ (ఎలెక్ట్రానిక్ పర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్) విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు.



ఇప్పటికే ఈ-ఆఫీస్ సిస్టమ్ ఆచరణలో ఉండగా అన్ని శాఖల్లో హెచ్ఓడి స్థాయి నుండి క్షేత్ర స్థాయి వరకు అన్ని కార్యాలయాలకు సంబంధించి అన్ని డాక్యుమెంట్లను స్కానింగ్ చేసి ఈపిటీఎఫ్ పోర్టల్ లో అప్ లోడ్ చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని శాఖలు జిల్లా స్థాయి కార్యాలయం నుండి మండల, గ్రామ స్థాయి కార్యాలయాల వరకు అఫీషియల్ కరస్పాండెన్స్, ఉత్తర ప్రత్యుత్తరాలు, జీవోలు, మెమోలు, అన్ని రకాల కార్యకలాపాలకు సంబంధించి ప్రతి డాక్యుమెంట్ ను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలను పారదర్శకంగా అన్ని శాఖల సమాచారాన్ని కింది నుండి పైస్థాయి అధికారులకు ఆన్ లైన్ లోనే తెలుసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ తరహాలో ప్రత్యేకమైన నూతన పోర్టల్ ను ఆవిష్కరించి నిర్వహణలోకి తీసుకురానుందన్నారు. అందుకుగాను జిల్లా స్థాయిలో ప్రతి శాఖ వారి పరిధిలోని డివిజన్, మండల, గ్రామ స్థాయిలో అన్ని కార్యకలాపాలకు సంబంధించిన డేటాను స్కాన్డ్ డాక్యుమెంట్ రూపంలో భద్రపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఐసి ఆధ్వర్యంలో నిర్వహణలోకి రానున్న ఈ విధానం ద్వారా.. ఆన్ లైన్ లో కార్యాలయ కరస్పాండింగ్ విధానం మరింత పటిష్టంగా, పారదర్శకంగా సాగనుందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఐసి టెక్నీకల్ సహాయకులు ఈపీటీఎస్ పోర్టల్ లాగిన్, శాఖల కేటగిరీల ఎంపిక, వివిధ రకాలైన డాక్యుమెంట్ ఫైల్స్ ను ఎలా అప్ లోడ్ చేయాలో-ఇ× టెక్నాలజీ ద్వారా నడిచే విధానాన్ని డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, జిల్లా ఇన్ఫర్మేషన్ సహాయకులు ఉదయ్, టెక్నీకల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత, భద్రతా ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, ఫిబ్రవరి 03(భారత శక్తి) : పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా, నిబంధనలకు లోబడి అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కడప ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఎయిర్ పోర్ట్ అధికారులను ఆదేశించారు. కడప ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో నూతన టర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదర్ తోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా నూతన టెర్మినల్ భవన నిర్మాణాలను పటిష్టంగా చేపట్టాలన్నారు. ఎయిర్ పోర్టు పరిసరాల్లో ఎలాంటి అనధికారిక చర్యలు కానీ, భద్రతకు భంగం వాటిల్లే సంఘటనలు కానీ, నిర్మాణ పనులకు ఆటంకం కలిగించే చర్యలు కానీ చోటు చేసుకోకుండా రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నూతన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులను అత్యంత నాణ్యతతో, భద్రతా ప్రమాణాలతో నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా పర్యావరణానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఏరో డ్రమ్ నిర్మాణ పనులను చేపట్టేందుకు సంబందిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, రెవెన్యూ, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సంపూర్ణత అభియాన్ - 2.0" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్. చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 3(భారత శక్తి) : ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో భాగంగా "సంపూర్ణత అభియాన్ - 2.0" నిర్దేశించిన ఇండికేటర్లను అన్ని ప్రామాణికాల్లో వంద శాతం సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని సభాభవన్ క్యాంప్ కార్యాలయంలో ఆకాంక్షిత జిల్లా,బ్లాకు స్థాయికి సంబంధించి మూడు నెలల పాటు నిర్వహించే "సంపూర్ణతా అభియాన్ 2.0" కార్యక్రమ ప్రారంభోత్సవ సన్నాహాలు,ఆకాంక్ష జిల్లా, బ్లాకులలో కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "సంపూర్ణతా అభియాన్ 2.0'' ఫోకస్ ఇండికేటర్లయిన ఆరోగ్యం, పోషణ,విద్య,వ్యవసాయం మరియు సంబంధిత రంగాల సేవలలో మెరుగుదల కోసం ఆయా ఇండికేటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలల్సి ఉంటుందన్నారు. నీతీ ఆయోగ్ చేపట్టిన "సంపూర్ణత అభియాన్ 2.0" ముఖ్య ఉద్దేశ్యం మేరకు 6 అంశాల్లో రానున్న మూడు నెలల కాలంలో (28 జనవరి 2026 నుండి 14 ఏప్రిల్ 2026 వరకు) 100% సంతృప్తికర స్థాయిలో జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలలో ఆకాంక్ష జిల్లా మరియు ఆకాంక్ష బ్లాకుల స్థాయిలో ఆయా ఇండిక్టేటర్లలో సేవల మెరుగుపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన సదస్సులలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబందిత శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలను తప్పకుండా భాగస్వామ్యం చేయాలన్నారు.

గత ఏడాది జిల్లాలో చేపట్టిన "సంపూర్ణతా అభియాన్ 1.0" కార్యక్రమాన్ని నీతీ ఆయోగ్ సూచించిన

1) వైద్యం మరియు ఆరోగ్య రంగంలో ప్రెగ్నన్ట్ ఉమెన్ సమస్యలు

2) బాలింత తల్లుల పోషకాహార సమస్యలు.

3) ఎడ్యుకేషన్ లో మౌలిక సదుపాయలు.

4) వ్యవసాయములో సాయిల్ హెల్త్ కార్డులు పంపిణి.

5) గ్రామీణాభివృద్ధి రంగాలలో ఎస్.హెచ్.జి గ్రూపులకు బ్యాంకు రుణాలు అందజేయుట...

మొదలైన ప్రామాణికాలలో జిల్లాలో 100% పైగా ఆకాంక్ష జిల్లాల లక్ష్యాన్ని సంతృప్తి కరంగా అధిగమించ గలిగామన్నారు.

నీతీ ఆయోగ్ ఎంపిక చేసిన అన్ని ఇండికేటర్లలోని అన్ని ప్రామాణికాల్లో జాతీయ స్థాయిలో వైఎస్ఆర్ కడప జిల్లా 76.3 పాయింట్లు అధిక్యతలో 100% లక్ష్యాన్ని అధిగమించడం జరిగిందని, ఈ విషయాన్ని మనం గుర్తుచేసుకోవడం అభినందనీయం అన్నారు.

అదే స్ఫూర్తితో "సంపూర్ణతా అభియాన్ 2.0" కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించేందుకు ఆకాంక్ష జిల్లా, బ్లాకుల పరిధిలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది లక్ష్య సాధన దిశగా అడుగు లేయాలని సూచించారు. 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం, 11వ తేదీన ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే ఇలా ఈ మూడు నెలల్లో వచ్చే ప్రత్యేక రోజుల సందర్భాలను పురస్కరించుకుని సంబందిత శాఖలు సంపూర్ణతా అభియాన్ 2.0 కార్యక్రమంలో సూచించిన ఇండికేటర్లలో 100% లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు.

యాస్పిరేషన్ డిస్ట్రిక్ట్ లెవల్స్ లో సూచించిన ఇండికేటర్లు..లి

1. పుట్టినప్పుడు శిశువుల బరువు నిష్పత్తిని గుర్తించడం

2. పిల్లలకు తల్లిపాలు ఇస్తున్న తల్లులకు తగినంత ఆహారం అందించే అంశం (6 నుండి 23 నెలలు)

3. ఒక నెలలో కనీసం ఒక సారి ఎసూచీణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నివేదించబడిన అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య

4. జిల్లాలోని మొత్తం పాఠశాలలలో.. తగిన సంఖ్యలో బాలికల టాయిలెట్ సౌకర్యాలున్న పాఠశాలల శాతం

5. పశువులు, పెంపుడు, పోషణ టీకాలు వేసిన జంతువుల శాతం

యాస్పిరేషన్ బ్లాక్ లెవల్స్ లో సూచించిన ఇండికేటర్లు..

1. ఐసిడిఎస్ కార్యక్రమం కింద క్రమం తప్పకుండా అనుబంధ పోషకాహారాన్ని తీసుకుంటున్న (6 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు) పిల్లల శాతం

2. రిపోర్టింగ్ నెలలో ఆవాజలో చేరిన పిల్లల సామర్థ్యాన్ని కొలవడం

3. క్రియాత్మక టాయిలెట్‌తో పనిచేసే ఆవాజ శాతం

4. తాగునీటి సౌకర్యంతో పనిచేసే ఆవాజ శాతం

5. మొత్తం పాఠశాలల సంఖ్యతో పోలిస్తే బాలికల టాయిలెట్ సౌకర్యం ఉన్న పాఠశాలల శాతం

6. పశువుల టీకాలు వేసిన జంతువుల శాతం

ఆరోగ్యం, పౌష్టికాహారం గురించి ప్రస్తావిస్తూ... ప్రపంచంలోనే అత్యంత పోషక విలువలున్న మునగ చెట్టు ఆకును ప్రతి ఇంటిలోను రోజువారీ ఆహారంలో భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

అనంతరం "సంపూర్ణతా అభియాన్ 2.0" కార్యక్రమాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్లను జిల్లా కలెక్టర్... జేసీ, సంబందిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా,




రాష్ట్ర రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ బాబు, సిపిఓ హజరతయ్య, జడ్పీ సిఈఓ ఓబులమ్మ, డిఎంఅండ్ హెచ్ఓ డా. నాగరాజు, ఐసిడిఎస్ పిడి రమాదేవి, డిఈఓ శంషుద్దీన్, ఎల్డిఎం జనార్ధనం, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల జిల్లా అధికారులు చంద్రా నాయక్, శ్రీనివాసులు, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మీ, సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ఎడిపి యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# యల్.బి.ఆర్.సి.ఈ లో అంతర్-రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 03:

కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించుచున్న, మై భారత్ (మై భారత్) కార్యక్రమం భాగంగా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యన్.యస్.యస్. యూనిట్ ఆధ్వర్యంలో అంతర్-రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం (ఇంటర్ - స్టేట్ యూత్ ఎక్స్చేంజి ప్రోగ్రామ్) (03-02-2026 నుండి 07-02-2026) ఐదు రోజుల పాటు జరుగనుంది. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా స్టేట్ యన్.యస్.యస్ ఆఫీసర్ డా.యమ్.సుధాకర్ గారు మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల యువత మధ్య సాంస్కృతిక అవగాహన, జాతీయ సమగ్రతను మరియు 'ఏకభారతం-శ్రేష్ఠ భారతం' స్ఫూర్తిని పెంపొందించడానికి రూపొందించబడింది. ఈ కార్యక్రమం ద్వారా యువకులు వేరే రాష్ట్రాల సంస్కృతులు, సాంప్రదాయాలు, జీవనశైలి మరియు సామాజిక-ఆర్థిక అంశాలను ప్రత్యక్షంగా అనుభవిస్తారు అని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి గారు మాట్లాడుతూ కేరళ రాష్ట్ర నుండి 37 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు, వారికి ఆంధ్ర రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, భాష, సామాజిక జీవన విధానం గురించి అవగాహన పొందుతారు . కేరళ రాష్ట్ర నుండి వచ్చిన యువతతో పరస్పర సంభాషణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాపులు, చర్చా వేదికల ద్వారా జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోనున్నారు , మరియు ఆంధ్రలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత గల ప్రాంతాలను సందర్శించి, రాష్ట్ర అభివృద్ధి నమూనాలు, పర్యావరణ పరిరక్షణ




చర్యలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల అమలు విధానాలపై అవగాహన పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువ అధికారి శ్రీ సుంకర రాము గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి భావన, భిన్నత్వం లో ఏకత్వం అనే ఆలోచన మరింత బలపడిందని, ఇలాంటి కార్యక్రమాలు యువతను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో , ఎన్టీఆర్ జిల్లా యన్.యస్.యస్. ఆఫీసర్ డా.రమేష్ గారు, ఎ.పి.యస్.యస్.డి.సి. అసిస్టెంట్ యన్.యస్.యస్. యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, శ్రీ.శీలం ఉమా మహేశ్వర రెడ్డి గారు, మరియు కేరళ రాష్ట్ర విద్యార్థిని , విద్యార్థులు మరియు కళాశాల యన్.యస్.యస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి

పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 03: పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీలోని గిరినగర్-1 అంగన్వాడీ కేంద్రంను మంగళవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బియ్యం,పప్పు, నూనె, పాలు, కోడి గుడ్ల నాణ్యతను పరిశీలించారు. అంగన్వాడీ రికార్డులు, చిన్నారుల హాజరు తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ సిలబస్ అమలు తీరును పర్యవేక్షించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు వయస్సుకు తగ్గ బరువు ఉండే విధంగా పౌష్టికాహారం అందించాలని చెప్పారు. చిన్నారుల రోజువారీ హాజరును పరిశీలించి, కేంద్రాలకు సరఫరా అయ్యే



నిత్యావసర సరుకుల నాణ్యతను పర్యవేక్షించాలని, ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఐసిడిఎస్ అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేషంట్లపై డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
## - సి.హెచ్.సి, జిపిఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ పిఓ

భద్రాద్రి జిల్లా బ్యూరో, (భారతశక్తి)ఫిబ్రవరి 03: మారుమూల గిరిజన గ్రామాల నుండి నిరుపేదలైన గిరిజనులు సిహెచ్ సి ఆసుపత్రికి వస్తూ ఉంటారని వారి పట్ల డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపి అన్ని రకాల టెస్టులు నిర్వహించి తప్పనిసరిగా వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం బూర్గంపాడు ప్రభుత్వ సిహెచ్ సి వైద్య శాలను, జిపిఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ సిహెచ్ సిలో లేబరేటరీ, ఆపరేషన్ థియేటర్, గర్భిణీ స్త్రీల కాన్పుల గది, అవుట్ పేషెంట్ల గది, అల్ట్రా సౌండ్ స్కానింగ్ గది, మందులు నిలువచేసే గది, కొత్తగా నిర్మాణం చేపడుతున్న సిహెచ్సి పనులను పరిశీలించారు. రోగులకు అందుతున్న స్కానింగ్ సేవలు, అవుట్ పేషెంట్లు, ఇన్ని పేషెంట్ల, స్టోర్ రూమ్ లో ఉన్న మందుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సౌకర్యాల గురించి అవుట్ పేషెంట్లను, వార్డులలో వైద్య సేవలు పొందుతున్న పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడకుండా వారి గ్రామాల నుండి అంబులెన్స్ లో తీసుకొని రావాలని, డెలివరీ అయ్యే వరకు పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉన్నది లేనిది పరిశీలించి, తల్లితోపాటు బిడ్డ కూడా సక్రమంగా వైద్య చికిత్సలు చేయాలని సూచించారు. పీహెచ్సీ పరిధిలో పనిచేసే సిబ్బంది గర్భిణీ స్త్రీల పట్ల జాగ్రత్తలు తీసుకొని వారికి నెలసరి చికిత్సలు ఏ విధంగా తీసుకోవాలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వాతావరణం మార్పు వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిహెచ్ సి ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులను ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందించాలని, వివిధ రకాల టెస్టుల కోసం పేషెంట్లను ఎవరిని ప్రైవేట్ ల్యాబ్ లకు పంపించకూడదని, ఎవరైనా పేషెంట్లు ప్రైవేట్ ల్యాబ్ లలో టెస్టింగులు నిర్వహించినట్లు తన దృష్టికి వస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. అలాగే ఆసుపత్రి పరిసరాలు, వార్డులు ప్రతిరోజు శుభ్రంగా ఉంచాలని అన్నారు. రెండు కోట్ల 70 లక్షల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న కొత్త సి హెచ్ సి పనులలో వేగవంతం చేసి వర్షాకాలం వచ్చేసరికి కొత్త భవనంలో సిహెచ్సి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అనంతరం బూర్గంపాడు హుడ్ యార్డ్ లోని జిపిఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్దీపకం వర్క్ బుక్ లోని పదాలను ఇతర అంశాలను విద్యార్థుల చేత బోర్డుపై వ్రాయించి



దానికి సంబంధించిన తాత్పర్యాలు పిల్లలను అడగగా వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో సంబంధిత ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చిన్నారుల విద్యాభ్యాసం బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టడం జరిగిందని, ఉద్దీపకం వర్క్ బుక్ లోని పదాలు విద్యార్థులు సరిగా చెప్పకపోవడం ఉపాధ్యాయుల పనితీరు ఎలా ఉందో అర్థమయిపోతుందని, ఈ నెలలో మరల ఈ పాఠశాలను సందర్శిస్తానని ఈ లోపల పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని ప్రతి పదాలు, గుణకారాలు, భాగాహారాలు, చతుర్వేదికలు అన్ని పిల్లలు చెప్పే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని, లేనియెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులందరినీ పరీక్షలు సక్రమంగా రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఎం హెచ్ ఓ సైదులు, పర్యవేక్షకుడు ముక్కంటి ఈశ్వరరావు, డాక్టర్లు అనిత, నిషార్ సిహెచ్సి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా గోవులను రవాణా చేసిన వారిపై పోలీసులు ఉక్కుపాదం

మణుగూరు, ఫిబ్రవరి 03 (భారతశక్తి): అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న ముగ్గురు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు అశ్వాపురం సిఐ జి. అశోక్ రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున మణుగూరు నుంచి వి.ఎమ్ బంజరుకు టాటా ఏసీ ట్రాలీలో ఏడు గోవులను కట్టివేసి తీసుకువెళ్తుండగా అశ్వాపురం పోలీస్ సిబ్బంది వాటిని రక్షించడం జరిగిందని తెలిపారు. వాటిని వెంటనే పాల్వంచలోని గోశాలకు తరలించడం జరిగిందన్నారు. అక్రమంగా గోవులను కబేళాలకు తరలిస్తున్న భద్రాద్రి జిల్లా, మణుగూరు కు చెందిన పశువుల వ్యాపారులు మహమ్మద్ హైమద్, ఎండి యాకూబ్ పాషా, ఖమ్మం జిల్లా, కల్లూరు మండలానికి చెందిన షేక్ అజ్మత్ పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పశువులను అక్రమ రవాణా చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఈ సందర్భంగా సిఐ హెచ్చరించారు. ఎవరికైనా పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే అశ్వాపురం ఎస్ హెచ్ ఓ నంబర్ 8712682093 కి సమాచారం అందించాలని కోరారు.



# అభ్యర్థులను గెలిపించుకోండి
## - వార్డు సమస్యల పరిష్కారానికి నేను హామీ
## - టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 3:

కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మీదేనని, వార్డులలో సమస్యల పరిష్కారం నేను చూసుకుంటానని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని ఆయన నివాసానికి తరలివచ్చిన నాయకులు పోటీ చేసే అభ్యర్థులకు ఈ మేరకు జగ్గారెడ్డి దిశా నిర్దేశం చేశారు. గెలిపించుకోవాల్సిన బాధ్యత మీదేనని, వార్డు సమస్యల పరిష్కారం నేను చూసుకుంటానని భరోసానిచ్చారు. సంగారెడ్డి మున్సిపాలిటీలోని 38 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి వార్డుల అభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తానన్నారు. ముఖ్యంగా సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణం పూర్తిచేసేలా చూస్తానన్నారు. రాంనగర్ అభ్యర్థి శ్రీకాంత్ గౌడ్ శివుడికి కోఆప్షన్ సభ్యుడిగా అవకాశం కల్పిస్తానన్నారు. ఐదేళ్ల తర్వాత రాంనగర్ అభ్యర్థిగా సిద్దు ఉంటాడని ఇదే ఫైనల్ అని స్పష్టం చేశారు. అభ్యర్థులను గెలిపించుకోవడంతో పాటు వార్డులలో పరిచయం ఉన్నవాళ్లను కూడా గెలిపించేలా ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎలాంటి కారణాలు చెప్పొద్దని అభ్యర్థులను గెలిపించుకోవాలనేడే బాధ్యత అన్నారు. ఐదో వార్డ్ చెందిన అమీర్ బేగ్ కో ఆప్షన్ సభ్యుడిగా అవకాశం కల్పిస్తానని ఆ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకొని రావాలని అమీర్ బేగ్ ఆదేశించారు. ఎన్నికల వేళ జగ్గారెడ్డి నివాసానికి నాయకులు పోటీ చేసే అభ్యర్థులు ఆయా కాలనీల ప్రజల తాకిడి పెరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటీ చేసే అభ్యర్థులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 3 :

అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణం, సంగారెడ్డిలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు..ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తున్న ప్రాణాంతక వ్యాధిగా మారిందని తెలిపారు. అయితే కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి సరైన వైద్య చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా మహిళలు మరియు యువత ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మరియు అధ్యాపకులు కేన్సర్ వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలు మరియు ప్రారంభ దశలో గుర్తింపు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్రెస్ట్ కేన్సర్ మరియు సర్వికల్ కేన్సర్ పై ప్రత్యేక అవగాహన కల్పించి, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే యువతలో పెరుగుతున్న మౌత్ కేన్సర్, లంగ్ కేన్సర్ వంటి వ్యాధులకు ధూమపానం మరియు పొగాకు వాడకం ప్రధాన కారణమని తెలిపారు.కేన్సర్ వ్యాధి నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం మరియు మానసిక ఒత్తిడి నియంత్రణ ఎంతో అవసరమని నిపుణులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు మరియు చికిత్సా సౌకర్యాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. కేన్సర్ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలు మరియు భయాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు కేన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు మరియు సమాచార పత్రాలు పంపిణీ చేయబడింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు మరియు సమాజానికి కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు కేన్సర్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, న్యాయ అవగాహన మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా కార్యదర్శి బి. సౌజన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కేన్సర్ వ్యాధిపై సమగ్ర అవగాహన పెంపొందించబడింది.

# ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు.



భద్రాద్రి జిల్లా బ్యూరో, (భారతశక్తి)ఫిబ్రవరి 03: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ములకలపల్లి, అశ్వారావుపేట మండలాల్లోని పలు జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ములకలపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రయోగ పరీక్షల నిర్వహణ విధానం, ప్రయోగశాలల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు నమోదు, ప్రశ్నపత్రాల భద్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అశ్వారావుపేట మండలంలోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలను కూడా తనిఖీ చేసి పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. రెండవ రోజు నిర్వహించిన ప్రయోగ పరీక్షల హాజరు వివరాలను సమీక్షించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, ఉదయం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 1,295 మందిలో 1,263 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,386 మందిలో 1,207 మంది హాజరుకాగా 179 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం ఉదయం జరిగిన పరీక్షలకు 2,681 మందికి గాను 2,470 మంది హాజరై 211 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 880 మందిలో 861 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,365 మందిలో 1,308 మంది హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,245 మందికి గాను 2,169 మంది హాజరై 77 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, ప్రయోగ పరీక్షలు పూర్తయ్యే వరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని కళాశాల యాజమాన్యాలను ఆయన ఆదేశించారు.

# కోర్టుకు తప్పుడు నివేదికలు సమర్పించిన ఫారెస్ట్ అధికారులు.!

**–ఇసుక లారీలకు అక్రమ రాజమార్గం**

**–భారీ వృక్షాలను నరికి అమ్ముకున్న ఫారెస్ట్ శాఖ**

**–మామూళ్ల మత్తులో గిరిజన జీవనాధారం నాశనం**

**–అటవీ అధికారులు బహిరంగ చర్చకు సిద్ధమా.! సాక్షాలతో నిరూపిస్తాం.!**

**–సవాల్ విసిరిన రేణుక అక్షర మహిళా మండలి**

మణుగూరు, ఫిబ్రవరి 03 (భారతశక్తి): మండల పరిధిలోని గుట్ట మల్లారం – కమలాపురం వరకు అక్రమంగా అడవిని నరికి, న్యాయస్థానానికి తప్పుడు నివేదికలు సమర్పించి ఇసుక లారీలు తిరగడానికి అనుమతులు తెచ్చుకున్నారని రేణుక అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆరోపించారు. అంబేద్కర్ సెంటర్లలో గల రేణుకా చౌదరి క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మణుగూరు డివిజన్ అటవీ శాఖ అధికారులు బడా



ఇసుక కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతూ మామూళ్లు తీసుకుని అడవిని అమ్ముకోవడం సబబు కాదని ఆమె మండిపడ్డారు. 5 కిలోమీటర్లకు పైగా వందలాది మహా వృక్షాలు ఉన్న అడవిని భారీ యంత్రాలతో తొలగించి సుమారు 40 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణం చేపట్టారని ఆమె ఆరోపించారు. న్యాయస్థానానికి కేవలం 30 చెట్లు మాత్రమే తొలగించామని తప్పుడు నివేదికలు సమర్పించి కోర్టును సైతం తప్పుదారి పట్టించి అనుమతులు తెచ్చుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ఇది మొత్తం ఇసుక కాంట్రాక్టర్లకు రాజమార్గం ఏర్పాటు చేయడానికే జరుగుతున్న కుట్రగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. అడవిని ఎన్ని కిలోమీటర్లు తొలగించారో.. వాటికి సంబంధించిన సాక్ష్యాధారాలు మా దగ్గర ఉన్నాయని తెలిపారు. అటవీ శాఖ అధికారులు తప్పు చేయలేదనుకుంటే స్థానిక అంబేద్కర్ సెంటర్‌కు వచ్చి ప్రజల ముందే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని ఆమె సవాల్ విసిరారు. ఎంత మేర అడవిని నరికించారో సాక్షాలతో సహా నిరూపిస్తామని అధికారులకు చిత్తశుద్ధి ఉంటే నిరూపించుకోవాలన్నారు. దొంగ పత్రాలు సృష్టించి గిరిజనులకు అన్నం పెట్టే అడవిని, పక్షుల నివాసాలను, జంతువుల ఆవాసాలను నాశనం చేసిన పాపం అటవీ అధికారులను వెంటాడుతుందని విమర్శించారు. రక్షించాల్సిన వారే భక్షిస్తే అటవీ రక్షకులు ఎలా అవుతారో అధికారుల విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆమె వ్యాఖ్యానించారు. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయిస్తామని, ఇందులో భాగస్వాములైన అధికారులు, కాంట్రాక్టర్లు అందరికి చట్టపరంగా శిక్ష పడే వరకు రేణుక అక్షర మహిళా మండలి పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డి బోయిన రేణుక, కన్నాపురం శైలజ, దేరంగుల సుజాత, డాకూరి సౌజన్య తదితరులు ఉన్నారు.

# వార్డు అభివృద్ధికి అండగా ఉంటా

## – కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవాజ్
## – ఆరో వార్డులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 3:

సంగారెడ్డి మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచార హడావిడి ఊపందుకుంది. ఆయా పార్టీల అభ్యర్థులు బీఫాంలో అందుకని ఏకంగా ప్రచార రంగంలోకి దూకారు. మున్సిపాలిటీలోని ఆరో వార్డు కాంగ్రెస్ అభ్యర్థి నవాజ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరో వార్డు అభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చి ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని ఓటర్లకు హామీ ఇస్తున్నారు. ఆరో వార్డు అభివృద్ధికి స్వచ్ఛందంగా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు జగ్గారెడ్డి నిర్మల ఆధ్వర్యంలో ఇప్పటికే పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభించి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వీటితోపాటు ఆరో వార్డ్ వార్డ్ అభివృద్ధి చేసి చూపిస్తానని ఓటర్లకు వివరించారు. ప్రచార ఆర్భాటాన్ని ఘనంగా ప్రారంభించి వార్డులో ముందుకెళ్తున్నారు. కాలనీవాసులు తన ప్రచారానికి సహకరిస్తున్నట్లు తెలిపారు. చేయి గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి చేయూతనివ్వాలని సూచిస్తున్నారు. తద్వారా మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల అభివృద్ధి అధికార లో ఉన్న పార్టీతోనే సాధ్యమవుతుందని భరోసా కల్పిస్తున్నారు. గెలిచిన వెంటనే ఇచ్చిన హామీలకు అనుగుణంగా వార్డు అభివృద్ధికి బీజం వేస్తానని ఓటర్లకు సూచిస్తూ ముందుకు వెళ్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థిని పై అఘాయిత్యానికి పాల్పడిన కిచక ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డి ని శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలి: సిపిఐ డిమాండ్

పోరుమామిళ్ల, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 03: విద్యార్థులకు పాఠాలు చెప్పవలసిన ఉపాధ్యాయుడు మద్యం సేవించి విద్యార్థిని పై వీధి కుక్కలా ప్రవర్తించిన ఉపాధ్యాయునిపై శాశ్వతంగా ఉపాధ్యాయ వృత్తి నుంచి తొలగించాలని సిపిఐ బద్వేల్ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్,మండల కార్యదర్శి రవి కుమార్ లు జిల్లా అధికారులకు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ )పోరుమామిళ్ల సిపిఐ బృందం గా కొండు గారి పల్లె గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్దకు వెళ్లి విద్యార్థినికి జరిగిన ఘటనపై విచారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరుమామిళ్ల మండల పరిధిలోని కొండు గారి పల్లె హరిజనవాడలో ఉన్న ప్రభుత్వ పాఠశాల కు నిన్న జరిగిన ఘటనపై డి ఈ ఓ షంషుద్దీన్, ఎంఈఓ కొండిశెట్టి ఇరువురు పరివేక్షణ చేయడం జరిగింది. వారితో సిపిఐ గా చర్చించి జరగబోయే రోజుల్లో ఇలాంటి సైకో సుబ్బారెడ్డి ను శాశ్వతంగా ఉపాధ్యాయ వృత్తి నుంచి తొలగించాలని వారు అన్నారు. అలాగే పోరుమామిళ్ల సిఐ, ఎస్ఐ లు కలసి కేసు నమోదు చేయడం జరిగింది కానీ విచారణ కోసం బిందు వారి తల్లిదండ్రులను కడపకు తీసుకెళ్లి డాక్టర్ పర్యవేక్షణలో చేసి వచ్చే రిపోర్టు ఆధారంగా అతనిపై చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది. మరోపక్క డి ఈ ఓ షంషుద్దీన్,ఎంఈఓ కొండిశెట్టి,జిల్లా ఉన్నతాధికారులు నివేదిక ప్రకారం ఏ చర్ల కైనా ముందు ఉంటామని చెప్పడం జరిగింది కానీ ప్రతిరోజు మద్యం సేవించి స్కూల్ కి వెళ్తున్నావు సుబ్బారెడ్డి పనిచేస్తున్న స్కూల్లోకి ఎంఈఓ వెళ్లి, అతన్ని మద్యం సేవించి, స్కూలుకు రా వద్దని మేము ఇవ్వడం, మందలించి ఉంటే ఇలాంటి ఘటన జరిగేవి కావు , ఎంఈఓ లు గతంలో ఒక్కరు ఉన్న బాగా స్కూలు పర్యవేక్షణ చేసేవాళ్లు ఇప్పుడు ఇద్దరు ఉన్న బోర్డు పెట్టుకోవడమే పరిమితం కావడం వలన ఈ సమస్యలు జటిలమవుతున్నాయి. బిందు సమస్యపై డిఇఓ, ఎంఈఓ లు,పోలీస్ అధికారులు, వైద్యులు,అందరూ కూడా తప్పుడు రిపోర్టుకు తావు లేకుండా జరగబోవు రోజుల్లో ఏ ఒక్క ఉపాధ్యాయుడు ఇలాంటి



అగైత్యాలకు పాలు పడకుండా ఉండాలంటే ఇలాంటి వారిని వెంటనే సమగ్ర విచారణ చేసి ఉపాధ్యాయ వృత్తి నుంచి తొలగిస్తే వేరొకరు చేయకుండా ఉంటారని ఆ విధమైన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పోరుమామిళ్ల మండల సమితిగా అధికారులకు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కేశవ, కార్యవర్గ సభ్యులు సనమాల చెన్నయ్య, పిడుగు పేరయ్య, షేక్ మహమ్మద్ హుస్సేన్, బొజ్జ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఫలితాలే.. మున్సిపల్ ఎన్నికల్లో విజయం కాంగ్రెస్ పార్టీ దే: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.

భూపాలపల్లి జిల్లా ( భారత శక్తి) పిబ్రవరి 3:

పంచాయతీ ఎన్నికల ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దాట్ల విజయ శ్రీనివాస్ 16, రాంనగర్, కాలనీ కౌన్సిలర్ అభ్యర్థి సీపీఐ మరియు సీపీఐ(యం) పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కొరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, సీపీఐ(యం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ముఖ్య నాయకులు మరియు ఆయా వార్డుల ఎన్నికల ఇంచార్జీ లతో కలిసి ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులల్లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.



అభివృద్ధి, సంక్షేమం నిరంతరం కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# 30 వార్డుల బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులకు బీ ఫామ్ లను అందజేసిన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి

భూపాలపల్లి జిల్లా (భారత శక్తి) ఫిబ్రవరి 3:

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డుల అభ్యర్థులకు బీ ఆర్ ఎస్ పార్టీ తరుపున బీ ఫామ్ లను మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ తో కలిసి అందజేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పార్టీ ఆదేశాల మేరకు రెబల్స్ లేకుండా ఏకాభిప్రాయంతో అన్ని వర్గాలకు సమ న్యాయం జరిగేలా అభ్యర్థులను ప్రకటించాము. బీసీ రిజర్వేషన్లు 07 అయినప్పటికీ జనరల్ స్థానాల్లో కూడా బీసీలకు బీ ఫామ్ లు ఇచ్చాం.



మున్సిపాలిటీ ఎలక్షన్లలో పోటీ చేయడానికి చాలామంది ఆశావాహులు ఎదురుచూసినప్పటికీ పార్టీ పరంగా ఒకరికి మాత్రమే టికెట్ ఇవ్వడం జరుగుతుంది కాబట్టి టికెట్ రానివారికి రాబోయే కాలంలో పార్టీ వారిని గుర్తించడం జరుగుతుంది. కాబట్టి ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేసి టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని అన్నారు.

# సినిమా

## మైకెల్ జాక్సన్ ట్రైలర్ రిలీజ్



పాప్ సింగర్ గా ప్రపంచ ఖ్యాతి గాంచిన మైకెల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా ఓ సినిమా రాబోతోంది. మూవీకి సంబంధించిన ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. జాక్సన్ లెగసీని ఆయన కుటుంబం నుంచి ఎవరూ కొనసాగించలేదు. అయితే, మైకెల్ జాక్సన్ బయోపిక్‌ను ప్రపంచానికి చూపించాలని ఆయన మేనల్లుడు జాఫర్ ముందుకొచ్చారు. తాజాగా ఆ మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రాన్ని దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో మైకెల్ జాక్సన్‌గా ఆయన మేనల్లుడు జాఫర్ కనిపించనున్నారు. జాక్సన్ మృతి చెందిన 16 ఏళ్ల తర్వాత ఈ మూవీ వస్తోంది. మైకెల్ బాల్య నుంచి సూపర్‌స్టార్‌గా ఎదిగిన ప్రయాణాన్ని ఈ మూవీలో చూపించనున్నారు. ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రం వరల్డ్‌వైడ్ రూ. 10 వేల కోట్లు రాబట్టవచ్చని ఇండస్ట్రీలో టాక్ ఉంది.

## లిటిల్ రాయల్

ఇటీవలే 'తెలుసు కదా' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన యంగ్‌హీరోయిన్ రాశీ ఖన్నా. ఒకేసారి తెలుగు, తమిళం, హిందీ, మలయాళంలోనూ నటిస్తూ కెరీర్ పరంగా వెనుదిరిగి చూసుకోనంత బిజీగా ఉంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ తెలుగులో ఫస్ట్‌టైం పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన నటించే చాన్స్‌కొట్టేసింది. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో శ్లోక అనే ఔత్సాహిక ఫోటోగ్రాఫర్‌గా కనిపించనుంది. ఇది ఈ ఏడాది ఏప్రిల్ విడుదలయ్యే అవకాశం ఉంది. మరోవైపు 'తలాఖోన్ మే ఏక్' చిత్రంతో పాటు అక్షయ్ కుమార్, విద్యాబాలన్‌లతో కలిసి అనీస్ బజ్మీ రూపొందించనున్న కామెడీ ఎంటర్‌టైనర్‌లోను రాశీ నటించనుంది. దీనికితోడు రాజ్ అండ్ డీకే 'ఫర్జీ 2' వెబ్ సిరీస్, 'రౌడీ అండ్ కో' తమిళ మూవీతో ప్రేక్షకులను అలరించనుంది. ఇక కెరీర్ పరంగా వరుస మూవీలతో బిజీగా ఉన్న రాశీ తన అభిమానుల కోసం సోషల్ మీడియాల్లో నిరంతరం టచ్ లోనే ఉంటుంది. కేవలం నటనతోనే కాదు తన అద్భుతమైన స్టైల్ కంటెంట్‌తోనూ కుర్రాళ్ల మతులు చెడగొడుతోంది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'ఏ లిటిల్ రాయల్, ఏ లిటిల్ క్వైట్' అంటూ క్యాప్షన్‌తో షేర్ చేసిన పిక్స్ కట్టిపడేస్తున్నాయి. 'వివాని బై వాని వాట్స్' డిజైన్ చేసిన చీరలో రాశీ దేవకన్యలా మెరిసిపోతోందంటూ ఫ్యాన్స్‌ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.



## కొంచెం డ్రామెటిక్‌గా!

నటి శ్రీలీల మరోసారి సోషల్ మీడియాను షేక్ చేశారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చెక్ ప్యాటర్న్‌తో రూపొందించిన స్ట్రాప్‌లెస్ డ్రెస్‌లో, నడుము చుట్టూ విస్తరించే ప్రత్యేక డిజైన్‌తో ఆమె లుక్ పూర్తిగా డ్రామాటిక్‌గా కనిపించింది. ఈ ఫోటోకు ఆమె "కొంచెం డ్రామాటిక్‌గా" అంటూ క్యాప్షన్ ఇచ్చి, తన క్రియేటివ్ లుక్‌పై ఆసక్తికర వ్యాఖ్య చేశారు. ఈ డ్రెస్ డిజైన్‌కు సంబంధించిన సృజనాత్మక సహకారాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇన్‌స్టా పోస్ట్ వైరల్ అవుతున్న తరుణంలోనే శ్రీలీల కెరీర్‌కు సంబంధించిన కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ధనుష్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం డీ55లో శ్రీలీల హీరోయిన్‌గా అధికారికంగా చేరినట్లు ప్రకటించారు. ఈ సినిమాకు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాణ సంస్థ వుందర్‌బార్ ఫిలిమ్స్ ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా వెల్లడించింది. ప్రకటనతో పాటు విడుదల చేసిన ఫోటోలలో ధనుష్‌తో పాటు సినిమా యూనిట్ మధ్య శ్రీలీల కనిపించారు. పాస్టల్ రంగు సూట్‌లో సింపుల్‌గా కనిపించిన ఆమెకు పూల బొకే ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ ఎంపిక అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ చిత్రానికి హీరోయిన్‌గా సాయి పల్లవి లేదా మృణాల్ ఠాకూర్ ఉండవచ్చని గతంలో ప్రచారం జరగగా, చివరకు శ్రీలీలకు అవకాశం దక్కింది.




## పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీకి సూపర్ స్టార్ కానుక



చెన్నై: తనకు దొరికిన బంగారాన్ని పోలీసులకు అప్పగించిన పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీని సూపర్ స్టార్ రజనీకాంత్ మెచ్చుకోవడంతో పాటు బంగారు గొలుసును కానుకగా అందించారు. చెన్నై మహానగర పాలకసంస్థలో కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మ (50) ఇటీవల తనకు రోడ్డుపై దొరికిన 45 తులాల బంగారాన్ని పోలీసులకు అప్పగించి పలువురు మన్ననలు అందుకున్నారు. తాజాగా ఆమెను అగ్ర కథానాయకుడు రజనీకాంత్ సన్మానించారు. తన ఇంటికి పిలిచి ఆమెతో ఆప్యాయంగా మాట్లాడిన రజనీకాంత్ ఆమెకు ఒక బంగారపు గొలుసును కానుకగా ఇచ్చారు. ఇక పద్మకు భారత తపాలా శాఖ ఇటీవల అరుదైన గౌరవాన్ని అందించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆమెకు రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా అందించారు. ఆమెను అభినందిస్తూ ప్రభుత్వం తరఫున రూ.లక్ష నగదు బహుమతిని చెక్కు రూపంలో అందించించిన సంగతి తెలిసిందే.

## అలాంటి వారికి నిద్ర ఎలా పడుతుంది

: రకుల్ ప్రీత్ సింగ్




బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై నటీనటులు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. ''పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదు'' అని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.

## అది నా వ్యక్తిగత విషయం



త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతుందంటూ నటి మృణాల్ ఠాకూర్ వరుసగా వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ వార్తలను మృణాల్ ఖండించింది. సిద్ధాంత్ చతుర్వేది ఆమె జంటగా నటించిన చిత్రం 'దో దివానే సెహర్ మే'. ఈ సినిమా ఈ నెల 20న విడుదలకానున్న సందర్భంగా ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో దీనిపై స్పందించింది మృణాల్. ప్రేమికుల రోజున మీ వివాహమంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తలపై మీ స్పందనేంటి.. అనే ప్రశ్నకు ''నన్ను ఎవరూ పిలవలేదు ఆ పెళ్లికి. నేను ఈ రూమర్స్ అన్నీ చూస్తూ చాలా నవ్వుకుంటున్నాను. ఇలాంటివి సృష్టిస్తున్న వాళ్లందరికీ థ్యాంక్స్. మీరంతా నా కోసం ఫ్రీ పీఆర్ చేస్తున్నారు. దీనిపై నేను చెప్పాలనుకుంటున్నదేంటంటే.. మీరు అనుకుంటున్నట్లు అది నిజం కాదు. కావాలంటే ఫిబ్రవరి 14న మీరే చూస్తారు. నేను పెళ్లి చేసుకుంటే ఆ వార్తని శ్రీ గణేశుడితో పాటు అభిమానులతోనూ తప్పకుండా పంచుకుంటాన''ని మృణాల్ చెప్పుకొచ్చింది.

## అందుకే నాలుగేళ్లు విరామం తీసుకున్నా: మాధవన్



విశ్రాంతి అవసరం అనిపించి నాలుగేళ్లు విరామం తీసుకున్నట్లు నటుడు మాధవన్ చెప్పారు. 2011 నుంచి 2015 వరకూ విరామం తీసుకున్న ఆయన 2016లో 'సాలా ఖదూస్'తో తిరిగి అలరించడం ప్రారంభించారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి పంచుకున్నారు. ''నేను చేస్తున్న పనిపై నిరాశ కలిగింది. అందుకే కొన్ని రోజులు విరామం తీసుకోవాలని భావించా. నాలుగేళ్లు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నాను. కనీసం ప్రకటనల్లో కూడా నటించలేదు. దేశంలో పర్యటించాను. గడ్డం పెంచుకొని చెన్నై చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు భారత్‌లోని ఎన్నో అందమైన ప్రదేశాలకు వెళ్లాను. అక్కడ రిక్షా వాళ్ల దగ్గరనుంచి ప్రతిఒక్కరితో మాట్లాడాను. వాళ్ల జీవనశైలి, వారిని ఇబ్బందిపెట్టే విషయాల గురించి తెలుసుకున్నా. ఆ నాలుగేళ్ల పర్యటన నాకు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పింది'' అని మాధవన్ అన్నారు. విరామం తర్వాత చేయాలనుకున్న పాత్రలపై మరింత స్పష్టత వచ్చిందని మాధవన్ అన్నారు. తాను తిరిగి వచ్చిన తర్వాత ఇండస్ట్రీలో కొందరు దర్శక నిర్మాతలకు ముందుచూపు లేదని తెలుసుకున్నట్లు చెప్పారు. అప్పటి నుంచి కొత్త దర్శకులను వెతుకున్నట్లు వెల్లడించారు. ఇటీవల 'ధురంధర్'లో కనిపించి ఆకట్టుకున్న మాధవన్.. ఆ సినిమా షూటింగ్‌లో అందరూ తనను 'రెయిన్ మ్యాన్' అని పిలిచేవారని తెలిపారు. తాను ఎప్పుడు సెట్‌కు వెళ్లినా వర్షం పడేదని అందుకే అందరూ తనను అలా పిలిచేవారని చెప్పారు. ఆ సినిమాలో ఎక్కువ సన్నివేశాలు ఎండ లేకుండా తెరకెక్కించినవేనని.. అవే సినిమాకు మరింత అందానిచ్చాయని తెలిపారు.

# బ్లడ్ బ్యాంక్ కాలనీ విద్యుత్ కష్టాలు తీర్చిన కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

హయత్ నగర్, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): లోవోల్టేజ్ సమస్యతో సతమతమవుతున్న హయత్ నగర్ డివిజన్ బ్లడ్ బ్యాంక్ కాలనీ వాసులకు ఉపశమనం లభించింది. కాలనీలో విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రారంభించారు.



**సమస్య నేపథ్యం -**

గత కొంతకాలంగా ఈ కాలనీలో విద్యుత్ వినియోగం పెరగడంతో లోవోల్టేజ్ సమస్య తీవ్రమైంది. దీనివల్ల గృహోపకరణాలు, మోటార్లు మొరాయించడమే కాకుండా, ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదులు అందిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించిన ప్రతినిధులు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఒక్కటే శాశ్వత పరిష్కారమని గుర్తించారు.

**మెరుగైన సరఫరా:**

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో కాలనీలోని ఇళ్లకు విద్యుత్ భార వహన సామర్థ్యం పెరిగి, సరఫరా స్థిరంగా మారింది. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని, పెండింగ్‌లో ఉన్న ఇతర విద్యుత్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు విద్యుత్ శాఖ ఏఈ ఖాదర్ అలీ, లైన్ మ్యాన్ అశోక్, నాయకులు బండారి భాస్కర్, అఖిలేష్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.



## 9వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీఫామ్ అందుకున్న విభూది మహేశ్వరి

వనపర్తి, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): వనపర్తి పట్టణ మున్సిపాలిటీ 9వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మాజీ కౌన్సిలర్ విభూది నారాయణ కూతురు విభూది మహేశ్వరి ఆదివారం రోజు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్పోర్ట్స్ ఛైర్మెన్ శివసేనారెడ్డి వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగారెడ్డి ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి చేతుల మీదుగా పార్టీ నుండి బీఫామ్ అందుకోవడం జరిగింది ఈ సందర్భంగా విభూది నారాయణ మాట్లాడుతూ పార్టీ కోసం నమ్ముకున్న నాయకుని కోసం అహర్నిశలు కష్టపడి పార్టీకి నమ్మకంగా ఉన్నందుకు ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి చొరవతో ఈరోజు కాంగ్రెస్ పార్టీ తన కూతురికి బీఫామ్ ఇవ్వడం ఎంతో గర్వంగా ఉందని తెలియజేస్తూ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డికి చైర్మన్ శివసేన రెడ్డికి వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి తనకు మద్దతుగా నిలిచిన 9వ వార్డ్ మర్రి కుంట ఇన్చార్జ్ చీర్ల ఆంజనేయులు సుధాకర్ భాష నాయక్ రాంజీ నాయక్ చీర్ల పాండు రాములు మన్యం తదితర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి చేయండి

**: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



వైయస్సార్ కడప, ఫిబ్రవరి 3 (భారత శక్తి): కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సభా భవన్ లో స్పర్శ్ లేప్రసి అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు లతో కలసి జనవరి 30 నుండి ఫిబ్రవరి 13న తేది వరకు జిల్లా వ్యాప్తంగా లెప్రసి వ్యాదిపై అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ వ్యక్తి కి అయిన స్పర్శ లేని తెలుపు, ముదురు గోధుమ రంగు మచ్చలు ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రోగి రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరమన్నారు. కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని, జనవరి 30 నుండి ఫిబ్రవరి 13న తేది వరకు జిల్లావ్యాప్తంగా లెప్రసి వ్యాది పై అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డా.నాగరాజు, అదనపు జిల్లా వైద్యాధికారి డా.రవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ముగింపు



కడప, ఫిబ్రవరి 3 (భారత శక్తి) : రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కడప జిల్లాలోని సింధూర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ట్రెయినీ ఐసి ఆర్ పి లకు సంబంధించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ఈ రోజు విజయవంతంగా ముగిసింది. ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా, పాల్గొన్న TICRPs కు ప్రకృతి వ్యవసాయం పై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో అమలులో ఉన్న వివిధ ప్రకృతి వ్యవసాయ మోడళ్లను ప్రత్యక్షంగా చూపించారు. అలాగే, జీవ ఉత్ప్రేరకాలను ప్రాక్టికల్‌గా తయారు చేయడం, వాటిని సాగులో వినియోగించే విధానం పై శిక్షణ ఇచ్చారు. అదనంగా, తమ స్వంత క్షేత్రాలలో నిర్వహించాల్సిన ఫీల్డ్ డాక్యుమెంటేషన్ ప్రాముఖ్యత మరియు విధానాలపై కూడా వివరంగా అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ ప్రవీణ్ కుమార్ గారు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ విధానాన్ని గ్రామస్థాయిలో ప్రతి రైతుకు చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి తెలియజేసి, రైతుల ఆదాయం పెరుగుదలకు మరియు పర్యావరణ పరిరక్షణకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన శిక్షార్థులకు ఆయన ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా TICRPs యొక్క సాంకేతిక పరిజ్ఞానం మరింత బలోపేతం అయి, ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో విస్తరించేందుకు వారు సమర్థంగా పనిచేయగలరని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధి విద్యతోనే సాధ్యం: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

కడప, ఫిబ్రవరి 03 (భారత శక్తి) : సమాజం విద్య పరంగా, ఆర్థిక పరంగా అత్యున్నత స్థాయికి ఎదగాలంటే ఒక్క విద్యతో మాత్రమే సాధ్యం అవుతుందని, ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు ముఖ్యంగా గుర్తుంచుకోవాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి సందేశం ఇచ్చారు.కడప నగరంలోని "ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్" లో నిర్వహించిన 2025-26 విద్యాసంవత్సర వార్షికోత్సవ వేడుక అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరై పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయించే బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. వారి విద్యాభివృద్ధికి తలిదండ్రులు ప్రధానంగా బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లల చదువుకంటే ముందుగా వారి నడవడిక ముఖ్యం అనే విషయాన్ని తెలుపుతూ సమాజం విద్య పరంగా, ఆర్థిక పరంగా అత్యున్నత స్థాయికి ఎదగాలంటే ఒక్క విద్యతో మాత్రమే సాధ్యం అవుతుందన్న విషయాన్ని కూడా జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు. విద్యారంగంలో గొప్ప చరిత్ర కలిగిన విద్యా సంస్థగా ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పలు బ్రాంచులతో వివిధ ప్రాంతాల్లో, దేశాల్లో దిగ్విజయంగా నడుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ఫిన్ ల్యాండ్ దేశంలో అత్యుత్తమ విద్యావ్యవస్థ నడుస్తోందని, అక్కడి విద్యావ్యవస్థలో విద్యార్థులు స్వేచ్ఛాయుత ఆలోచనా విధానంలో విద్యను అభ్యసిస్తున్నారని, అక్కడి తల్లిదండ్రులు కూడా విద్యార్థులు కోరుకున్న అంశాన్నే అభ్యసించేందుకు ప్రోత్సాహం అందించడం గొప్ప విషయం అన్నారు. అలాగే మన విద్య వ్యవస్థలో కూడా విద్యార్థులకు నచ్చిన విధంగానే విద్యాబ్యాసం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విలువలతో రూరల్ ప్రాంతంలో కూడా కార్పోరేట్ స్థాయిలో అత్యున్నత



ప్రమాణాలతో విద్యను అందిస్తున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యా సంస్థ యాజమాన్యానికి, ఇలాంటి పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. అంతకుముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల స్టాల్స్‌తో పాటు ఆర్ట్స్ గ్యాలరీని పాఠశాల గవర్నింగ్ కమిటీ సభ్యులైన చైర్మన్ శ్రీ ఎం. ఏ. ఫైజ్ ఖాన్, వైస్ చైర్మన్ శ్రీ జె. విక్రమదేవ్ రావు, గౌరవ కార్యదర్శి శ్రీ ఎం. ఆదిత్య రెడ్డి, సొసైటీ సభ్యుడు శ్రీ శ్యామ్ మోహన్, సభ్యుడు శ్రీ మసియుద్దీన్ అహ్మద్ మరియు పాఠశాల సలహాదారు డా. స్కంద్ బాలి — ఘనంగా ప్రారంభించారు.అధికారికంగా ప్రారంభించారు. అనంతరం తరగతి గదుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధునిక స్మార్ట్ ప్యానల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్, గేమ్స్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాలు పెంపొందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్‌కు తల్లిదండ్రులు మరియు సందర్శకులు విశేషంగా స్పందించారు. ఆతర్వాత చైర్మన్ శ్రీ ఎం. ఏ. ఫైజ్ ఖాన్ ఈ ఏడాది పాఠశాలలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, విద్యా, క్రీడా మరియు సాంస్కృతిక రంగాల్లో సాధించిన విశేష విజయాలను గవర్నింగ్ కమిటీ సభ్యులు మీడియా ప్రతినిధులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. శ్రీధర్ చెరుకూరి, ఐఏఎస్, కలెక్టర్ మరియు జిల్లా మజిస్ట్రేట్, వైయస్సార్ కడప జిల్లా, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రమశిక్షణ, లక్ష్య సాధన, సమయ నిర్వహణ మరియు విలువల ఆధారిత విద్య ప్రాముఖ్యతపై ప్రేరణాత్మక సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని సూచించారు. సాంస్కృతికకార్యక్రమాల్లో భాగంగా PP1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు "The Rumble Mumble" అనే ప్రత్యేక ప్రదర్శనను వేదికపై ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల సృజనాత్మకత, నృత్య-నాట్య నైపుణ్యాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ఆహ్వానిత అతిథుల మధ్య ఉత్సాహభరితంగా కార్యక్రమం ఆసాంతం కొనసాగి జయప్రదంగా ముగిసింది.

## అర్జీల పట్ల జిఆర్ఏలు భాధ్యతాయుతంగా స్పందించాలి

**: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

వై ఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 3 (భారత శక్తి) : అర్జీదారులు, ఫిర్యాదుదారుల సమస్యలపై జిఆర్ఏ (గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ) అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం లో భాగంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు కూడా అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా హాజరైన అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు.ప్రభుత్వ ఆశయానికి కట్టుబడి ప్రతి శాఖ జిల్లా అధికారితో పాటు ఆయా శాఖల మండల స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ అధికారులు పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో శాఖ అధికారులు ప్రధాన భూమిక పోషించాలన్నారు.



*** అన్ని కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానం అమలు జరగాలి:జిల్లా కలెక్టర్**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈఆఫీస్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈఆఫీస్ సిస్టమ్ ఆచరణలో ఉండగా.. అన్ని శాఖల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఇక మీదట అన్ని కార్యాలయాల్లో తప్పనిసరిగా ఈ ప్రక్రియ అమలు చేయాలన్నారు. ఇంకనూ ఆచరణలో లేని శాఖలు అందుకు సంబంధించిన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే సమకూర్చుకోవాలన్నారు.

*** అన్ని శాఖలు తప్పనిసరి గా డాక్యుమెంట్ అప్ లోడ్ చేయాలి**

అన్ని ప్రభుత్వకార్యాలయాల్లో అన్ని శాఖలు జిల్లా స్థాయి కార్యాలయం నుండి మండల, గ్రామ స్థాయి కార్యాలయాల వరకు అఫీషియల్ కరస్పాండెన్స్, ఉత్తర ప్రత్యుత్తరాలు, జీవోలు, మెమోలు, అన్ని రకాల కార్యకలాపాలకు సంబంధించి ప్రతి డాక్యుమెంట్ ను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలను పారదర్శకంగా అన్ని శాఖల సమాచారాన్ని కింది నుండి పైస్థాయి అధికారులకు ఆన్ లైన్ లోనే తెలుసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన నూతన ఎల్ఎల్ఎం టూల్ ను ఆవిష్కరించి నిర్వహణలోకి తీసుకురానుందన్నారు. అందుకుగాను జిల్లా స్థాయిలో ప్రతి శాఖ వారి పరిధిలోని డివిజన్, మండల, గ్రామ స్థాయిలో అన్ని కార్యకలాపాలకు సంబంధించిన డేటాను స్కాన్డ్ డాక్యుమెంట్ రూపంలో భద్రపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఐసి ఆధ్వర్యంలో నిర్వహణలోకి రానున్న ఈ విధానం ద్వారా ఆన్ లైన్ లో కార్యాలయ కరస్పాండింగ్ విధానం మరింత పటిష్టంగా, పారదర్శకంగాసాగనుందన్నారు.

*** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.**

1)ప్రొద్దుటూరు మండలం జోకే వీధి కి కు చెందిన షేక్ గౌసియా నాకు ఒంటరి మహిళా పింఛన్ మంజూరు. చేవలసిందిగా కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు.

2) చెన్నూరు మండలం లక్ష్మి నగర్ కు చెందిన ఉల్లిపాయల లక్ష్మి దేవి వికలాంగుల పింఛన్ మంజూరు చేయవలసిందిగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు.

3) పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి చెందిన మాచుపల్లె వెంకటరమణ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయుదురని కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు

4) దువ్వూరు మండలం బయనపల్లె గ్రామానికి చెందిన గడ్డ రామకృష్ణ తనకు వికలాంగులశాఖ వారి నుండి బ్యాటరీ సైకిల్ ఇప్పించగలరని సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు.

5)సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామానికి చెందిన కొమ్ము నల్లమ్మ మా తాతకు ఇద్దరు భార్యలు అందులో మా అమ్మ గజ్జల కుళ్లాయమ్మ నా పేరున ఇండ్లు రాయిచ్చినది కాని కొందరు ఆ స్థలాన్ని కబ్జా చేసారని సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ, డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి కోఆఫ్ రేటివ్ శాఖ అధికారి వెంకటసుబ్బయ్య, జిల్లా సర్వే మరియు భూమి రికార్డులు అధికారి శాంతరాజు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పరిశీలిస్తున్న .ఎస్పీ సునీల్ షొరాణ్.!

* **ప్రభుత్వ శాఖల సమన్వయంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి.!**
* **భక్తులు ఇతరులకు ఆటంకం లేకుండా పోలీసు వారి సూచనలను పాటిస్తూ తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి.!**





శ్రీశైలం ప్రతినిధి , ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): నంద్యాల జిల్లా శ్రీశైలం నందు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శనం నిమిత్తం వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వారికి ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ IPS పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది .అనంతరం శ్రీశైలం నందు భక్తులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా తీసుకునే చర్యలలో భాగంగా శ్రీశైలం నందు గల పార్కింగ్ ప్రదేశాలను అనగా రింగ్ రోడ్డు వద్ద గల పార్కింగ్ ప్రదేశాలను,RTCబస్టాండ్, సాక్షి గణపతి,హటకేశ్వరం ,సుండిపెంట గ్రామం నందు లింగాల గట్టు మొదలగుప్రదేశాలలో స్వయంగా పర్యటించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, మరియు లింగాలగట్టు స్నానఘాట్ లను కూడా పరిశీలించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం విచ్చేయు భక్తులు పోలీసు వారి సూచనలను పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం లేకుండా పార్కింగ్ చేసుకోవాలని,రోడ్డుకు ఇరువైపులా ఎట్టి పరిస్థితుల్లో పార్కింగ్ చేయరాదని విజ్ఞప్తి చేశారు.







## ముగ్గురి అదృశ్యం
# ఆందోళనలో కుటుంబ సభ్యులు

హయత్ నగర్, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): పనికి వెళ్లిన భర్త తిరిగి వచ్చేసరికి భార్య, ఇద్దరు పిల్లలు కనిపించకుండా పోయిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకాష్ నగర్ కాలనీకి చెందిన సయ్యద్ హమీద్ వెల్డింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి అస్మా బేగంతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నలుగురు పిల్లలు. పెద్దమ్మాయి హాస్టల్‌లో ఉండి చదువుకుంటుండగా, ముగ్గురు కుమారులు తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు.

*** పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి..**

జనవరి 30న ఉదయం 8 గంటలకు హమీద్ కుంట్లూర్ వద్ద ఉన్న తన వెల్డింగ్ షాపునకు వెళ్లాడు. ఉదయం 10:20 గంటల సమయంలో అస్మా బేగం తన తమ్ముడు సల్మాన్‌కు ఫోన్ చేసింది. పాఠశాలలో 'తల్లిదండ్రుల సమావేశం' (PTM) ఉందనీ, పెద్ద కొడుకు ఇబ్రహీంను చూసుకోవాలని చెప్పింది. తనతో పాటు మిగతా ఇద్దరు కుమారులు ఫయాజ్ (7), అద్నాన్‌లను తీసుకుని ఇంట్లో నుంచి బయలుదేరింది.

*** వెతికినా లభించని ఆచూకీ:**

సాయంత్రం హమీద్ ఇంటికి వచ్చేసరికి భార్యాపిల్లలు కనిపించలేదు. ఇంట్లోనే ఉన్న కుమారుడు ఇబ్రహీంను విచారించగా.. "అమ్మ తమ్ముళ్లను తీసుకుని ఆటోలో వెళ్ళింది" అని చెప్పాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు హమీద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో టైల్స్ మేస్త్రీ అదృశ్యం



హయత్ నగర్, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు వీడియో సెల్ఫీ రికార్డ్ చేసి అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది.

*** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..**

ఘటన నేపథ్యం : ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల పట్టణానికి చెందిన షేక్ దాదా పీర్ (36) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి, హయత్ నగర్ పరిధిలోని యాదవ నగర్ కాలనీలో ఉంటూ టైల్స్ పని చేసేవాడు. గత నెల 31న రాత్రి తన తమ్ముడు హిలహిని హయత్ నగర్ బస్ స్టాండ్ వద్ద దింపిన దాదా పీర్, తన వద్ద ఉన్న షైన్ బైక్, ఒక బ్యాగును తమ్ముడికి అప్పగించాడు. బ్యాగులో తన ఫోన్ ఉందని, అది స్విచ్ ఆఫ్ చేసి ఉందని చెబుతూ.. వాటిని నంద్యాలలో ఉన్న తన భార్య కరిష్మాకు అందజేయాలని సూచించి అక్కడి నుండి వెళ్లిపోయాడు.

*** వీడియో సెల్ఫీతో వెలుగులోకి..**

తమ్ముడు హిలహి నంద్యాల చేరుకుని అన్న ఇచ్చిన ఫోన్ ఆన్ చేసి చూడగా, అందులో దిగ్భ్రాంతి కలిగించే వీడియోలు కనిపించాయి. తీవ్రమైన ఆర్థిక కారణాల వల్ల తాను చనిపోతున్నట్లు దాదా పీర్ ఆ వీడియోలలో పేర్కొన్నాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే హయత్ నగర్‌కు చేరుకుని గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది.

*** పోలీసుల దర్యాప్తు**

దాదా పీర్‌కు నలుగురు కుమార్తెలు ఉన్నారు. తన అన్న ఆచూకీ కనిపెట్టాలని తమ్ముడు హిలహి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫోన్ సిగ్నల్స్, బస్ స్టాండ్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



తెలుగు సినిమా ప్రముఖ సినీ డైరెక్టర్ ఎన్.శంకర్ మాతృమూర్తి నిమ్మల సక్కుబాయమ్మ గత వారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయం తెలిసిన భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం సక్కుబాయమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి, సినీ దర్శకుడు ఎన్. శంకర్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 03 (భారత శక్తి):

# కర్మాన్‌ఘాట్ బాధితులకు అండగా రాజ్యాధికార పార్టీ






ఎల్బీనగర్, ఫిబ్రవరి 3 (భారతశక్తి): కర్మాన్‌ఘాట్ ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలను దేవాలయ భూముల పేరుతో ఖాళీ చేయించడం అన్యాయమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్ల వాసుదేవ్ విమర్శించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

*** అనుమతులిచ్చి ఇప్పుడెలా తొలగిస్తారు?**

సుమారు 35 ఏళ్ల క్రితం రియల్టర్లు లేఅవుట్ చేయగా, బాధితులు చట్టబద్ధంగా భూములు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని వాసుదేవ్ పేర్కొన్నారు. ఇళ్లు కట్టుకునే సమయంలో అధికారులు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా, అన్ని అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. దశాబ్దాల తర్వాత అకస్మాత్తుగా నోటీసులు ఇచ్చి ఖాళీ చేయమనడం పేదల జీవనాధారాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. బాధితుల కోసం అవసరమైతే ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అంజన్ కుమార్ యాదవ్, చంపపేట్ డివిజన్ అధ్యక్షుడు సందీప్, ఎన్టీఆర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు సంపత్, నాగోల్ డివిజన్ అధ్యక్షుడు గుడికందుల సురేందర్, పన్నాల అజయ్ కుమార్, రాజు, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ బస్తీల చిక్కుముడికి విముక్తి లభించేనా?

* **75 ఎకరాల భూమి అప్పగింత.. ఐదు ఎకరాల్లో పునరావాసం!**
* **వీసీకి డిప్యూటీ మేయర్ ప్రతిపాదన**



హైదరాబాద్, , ఫిబ్రవరి 3 (భారతశక్తి): ఉస్మానియా విశ్వవిద్యాలయ (ఓయూ) ప్రాంగణంలోని తొమ్మిది బస్తీల దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు పడుతున్నాయి. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఈ వివాదంపై డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి సోమవారం వర్సిటీ ఉపకులపతి (వీసీ) ప్రొఫెసర్ కుమార్ మాలుగారంతో భేటీ అయ్యారు. వర్సిటీ భూముల్లోని బస్తీల తొలగింపు, ప్రజలకు పునరావాసం కల్పించడంపై కీలక ప్రతిపాదనను ఆయన ముందుంచారు.

*** సమస్య నేపథ్యం - విశ్లేషణ**

ఓయూ పరిధిలోని తొమ్మిది బస్తీలు సుమారు 72 నుంచి 80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇక్కడ నివసించే వేలాది కుటుంబాలు ఏళ్ల తరబడి కనీస సౌకర్యాలైన మంచినీరు, సరైన రహదారులు, నిరంతర విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాలు వర్సిటీ భూముల్లో ఉండటంతో అక్కడ శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు, ఈ బస్తీల కారణంగా వర్సిటీ భద్రత, విస్తరణ పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు ఆటంకం కలుగుతోంది.

*** ప్రతిపాదించిన పరిష్కారం:**

ఈ చిక్కుముడిని విడదీసేందుకు డిప్యూటీ మేయర్ ఒక సమగ్ర ప్రణాళికను వీసీకి వివరించారు:

పునరావాసం: బస్తీ ప్రజలందరికీ సమీపంలోని ఐదు ఎకరాల స్థలంలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలి.

వర్సిటీకి లబ్ధి: ఇలా చేయడం వల్ల మిగిలిన సుమారు 70 ఎకరాల విలువైన భూమి తిరిగి విశ్వవిద్యాలయానికి దక్కుతుంది.

ప్రయోజనాలు: దీనివల్ల వర్సిటీ సరిహద్దులు స్పష్టంగా ఏర్పడి భద్రత పెరుగుతుంది. దశాబ్దాలుగా సరైన నివాసం లేని పేదలకు పక్కా ఇళ్లు లభిస్తాయి.

*** సానుకూల స్పందన:**

రాజకీయాలకు అతీతంగా, మానవతా దృక్పథంతో ఈ సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ కోరారు. ఈ ప్రతిపాదనపై వీసీ సానుకూలంగా స్పందించారు. దీనిపై సంబంధిత ప్రభుత్వ శాఖలతో చర్చించి, సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, వర్సిటీ యంత్రాంగం సమన్వయంతో ముందడుగు వేస్తేనే ఈ దశాబ్దాల సమస్యకు తెరపడే అవకాశం ఉంది.

# నగరాల్లో వ్యాధులపై నిఘా మరింత పటిష్టం

: **ఎంఎస్‌యూ సిబ్బందికి శిక్షణ ప్రారంభం**




హైదరాబాద్ , ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): నగర ప్రాంతాల్లో ప్రజారోగ్య భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ సిబ్బందికి మూడు రోజుల సంయుక్త ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని డా. ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్ లో ప్రారంభమైంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, థానే నగరాలకు చెందిన ఎంఎస్‌యూ సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

*** తక్షణ స్పందనే లక్ష్యం:**

కార్యక్రమానికి హాజరైన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ.. నగరాల్లో వ్యాధుల నివారణ, నియంత్రణలో ఎంఎస్‌యూ సిబ్బందిదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. వ్యాధుల వ్యాప్తిపై సత్వర సమాచారం సేకరించడం, వాటిని ధృవీకరించి తక్షణ చర్యలు చేపట్టడం ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. ముఖ్యంగా..

* నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు: కలరా, డయేరియా, వైరల్ హెపటైటిస్.
* దోమల ద్వారా వ్యాపించేవి: డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా.
* ప్రత్యేక నిఘా: మురికివాడలు, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలు, వలస కార్మికుల నివాసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

*** 'వన్ హెల్త్' విధానం.. సాంకేతికత వినియోగం:**

ఫుడ్ పాయిజనింగ్, జూనోటిక్ వ్యాధుల నియంత్రణకు 'వన్ హెల్త్' విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద ఏర్పాటైన ఎంఎస్‌యూ, హైదరాబాద్ నగర వ్యాధుల పర్యవేక్షణకు కేంద్రంగా పనిచేస్తుందని వివరించారు.

* మౌలిక సదుపాయాలు: ఐపీఎంలో బయోసేఫ్టీ లెవల్ 2 పరికరాలతో ప్రయోగశాల బలోపేతం.
* కమాండ్ కంట్రోల్ సెంటర్: హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేస్తున్న కేంద్రం ద్వారా నిఘా వేగవంతం.
* డిజిటల్ పర్యవేక్షణ: వెక్టర్ బోర్న్ డిసీజ్ యాప్ ద్వారా డెంగ్యూ కేసుల రియల్‌టైమ్ గుర్తింపు, జీఐఎస్ మ్యాపింగ్.

*** శిక్షణలో ప్రధానాంశాలు:**

మూడు రోజుల పాటు సాగే ఈ శిక్షణలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ పై ప్రత్యక్ష శిక్షణ ఇస్తారు. దీంతో పాటు ఎపిడెమియాలజీ పరిశోధనలు, డేటా భద్రత, రిస్క్ కమ్యూనికేషన్, ప్రజారోగ్య చట్టాలపై అవగాహన కల్పిస్తారు. ప్రజారోగ్య పరిరక్షణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత కాదని.. ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పశుసంవర్ధక శాఖల సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు హేమంత కేశవ్ పాటిల్, రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ ప్రియాంక అల, జాయింట్ డైరెక్టర్ డా. శుభాంగి కుల్సంగే, ఎంఎస్‌యూ ప్రతినిధి డా. ప్రదీప్ అవాటే, రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, సీఎమ్మెచ్ఓ డా. పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి .. విచారణ కమిషన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

తిరుమల, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి, అసలు వాస్తవాలను వెలికితీసేందుకు ప్రత్యేక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంగళవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సమర్పించిన నివేదిక, కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్, ప్రభుత్వానికి అందిన సమాచారం మధ్య తీవ్రమైన తేడాలు ఉన్నట్టు కేబినెట్ గుర్తించింది. సిట్ విచారణలో వెలుగు చూసిన కొన్ని కీలక అంశాలను ఛార్జ్‌షీట్‌లో ఎందుకు చేర్చలేదనే విషయంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మూడు అంశాల మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి, అసలు సూత్రధారులను, వాస్తవాలను నిగ్గు తేల్చేందుకే విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కమిషన్ ద్వారా తిరుమల లడ్డూ పవిత్రతపై భక్తుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. విచారణ కమిషన్ నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని కేబినెట్ తెలిపింది.




## పోటీదారులతో పోలిస్తే అమెరికాతో భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించింది

ఢిల్లీ, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించిందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఉజ్వల భవిష్యత్తుకు ఒక శుభసూచకమని ఆయన అన్నారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకువచ్చారని అన్నారు. ఈ విషయంలో దేశమంతా ఆయనకు అభినందనలు తెలుపుతోందని అన్నారు. ఈ ఒప్పందంతో పేదలు, రైతులు, యువత, మత్స్యకారులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటులో ప్రకటన చేద్దామని భావించానని, కానీ రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రతిపక్షం గందరగోళ పరిస్థితులను సృష్టించిందని అన్నారు. ఈ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో మన దేశ వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల ప్రయోజనాలను ప్రధాని మోదీ పరిరక్షించారని అన్నారు. నరేంద్ర మోదీ, ట్రంప్ మధ్య ఉన్న సత్సంబంధాల వల్లనే రెండు దేశాల మధ్య ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అన్నారు. సుంకాల తగ్గింపు ప్రకటన ట్రంప్ నుంచి వచ్చిందని, వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తుది వివరాలను ఖరారు చేశాక, సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని అన్నారు.

## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...
# 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

ఢిల్లీ, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ ఛైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్...
### రేపు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు

ఢిల్లీ, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ఎంపీలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ ఎంపీలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కాగా, రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి పనులపై చర్చించేందుకు, నిధులు రాబట్టేందుకు లోకేశ్ రేపు (ఫిబ్రవరి 4) కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం కానున్నారు. ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న లోకేశ్, బుధవారం పార్లమెంట్ భవనంలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక భేటీలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు, విద్యారంగ సంస్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు ఏపీ విభజన చట్టంలోని హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల మంత్రులతో లోకేశ్ చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రూ.92,649 కోట్ల పనుల వివరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ రైల్వే కారిడార్ల అంశంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. కీలక సమావేశాల అనంతరం బుధవారం రాత్రికి ఆయన తిరిగి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

## సహనమే భారత్ ను గెలిపించిందన్న మోదీ

ఢిల్లీ, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): విదేశాలతో వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రభుత్వం స్థిరమైన వైఖరితో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమెరికాతో చారిత్రాత్మక ట్రేడ్ డీల్ కుదిరిన సందర్భంగా ఎన్డీయే కూటమి సమావేశంలో మోదీ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించడంపై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. సుంకాల విషయంలో తమ ప్రభుత్వాన్ని విమర్శలు చుట్టుముట్టాయని గుర్తుచేసుకున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం సహనంతో వేచి ఉందని, దాని ఫలితం ఈ రోజు అందరూ చూస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్ తో అనుకూల ఆర్థిక వాతావరణం నెలకొందన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ఎస్‌ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం..

ఒడిశా, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని అందుకుంది. సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్‌ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షతో సుదూర గగనతల క్షిపణుల (ఎయిర్‌టుఎయిర్ మిసైల్స్) తయారీలో భారత్ స్వయంసమృద్ధి దిశగా మరో ముందడుగు వేసినట్లయింది. మంగళవారం ఉదయం 10:45 గంటల సమయంలో ఈ పరీక్షను నిర్వహించారు. ముందుగా గ్రౌండ్ బూస్టర్ సాయంతో క్షిపణి వ్యవస్థను నిర్దేశిత వేగానికి చేర్చారు. ఆ తర్వాత, నాజిల్‌లెస్ బూస్టర్, రామ్‌జెట్ మోటార్ వంటి అన్ని ఉప వ్యవస్థలు ప్రణాళిక ప్రకారం అత్యంత కచ్చితత్వంతో పనిచేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐటీఆర్‌లో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా నమోదు చేసి, ధృవీకరించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ విజయవంతం కావడంతో భారత్‌కు గగనతలంలో గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనం లభించనుంది. శత్రు విమానాలను చాలా దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పరిజ్ఞానం కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ చేరింది. డీఆర్‌డీవోకు చెందిన డీఆర్‌డీఎల్, హెచ్‌ఈఎంఆర్‌ఎల్, ఆర్‌సీఐ వంటి ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహించాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, సంబంధిత పరిశ్రమలను అభినందించారు. ఇది భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఈ నెలాఖరులోనే రాష్ట్ర బడ్జెట్ !

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను ఈ నెలాఖరులో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ మేరకు అధికారులకు తగిన సూచనలు చేశారు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం రాత్రి సమావేశమైన సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. ఈ నెల 1న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర నిధులపై కూడా ఆయన సమీక్షించారు. ఈ నెల చివరి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై వారంపాటు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో బడ్జెట్‌పై ఉత్కంఠ నెలకొంది.

*** గతేడాది రూ. 3.04 లక్షల కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ (20252026) అనేది తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన బడ్జెట్. తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా 2025 మార్చి 12న బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో 2025 మార్చి 19న బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ఉంది. రాష్ట్రం అప్పులు రూ.5,04,814 కోట్లుగా పేర్కొన్నారు ఆరు గ్యారంటీల అమలు కోసం బడ్జెట్‌లో 56,084 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

*** ఈ ఏడాది కేటాయింపులపై ఉత్కంఠ..**

రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్లుగా ఉండే అవకాశం ఉంది. సంక్షేమ పథకాలకు కేటాయింపులతో పాటు, ఆరు గ్యారెంటీల అమలుపై ఉత్కంఠ నెలకొంది. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్‌ను రూ.రెండు వేల నుంచి రూ. నాలుగు వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయిన నేపథ్యంలో ఇప్పటికైనా పెన్షన్‌ల పెంపు సరిపడా నిధులు కేటాయిస్తారో లేదోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు కీలకమైన వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు సచివాలయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. రెండేళ్లకు పైగా పాలనలో ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో ఆగ్రహంగా ఉన్న నిరుద్యోగులను ప్రసన్నం చేసుకునేందుకు నిరుద్యోగ భృతిని ప్రకటిస్తారని కొంతమంది భావిస్తుండగా.. మరికొంత మంది ఆ ప్రతిపాదలను కొట్టిపారేస్తున్నారు.

*** కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు అప్రాధాన్యం..**

ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు అంతగా ప్రాధాన్యం దక్కలేదు. బడ్జెట్‌లో తెలంగాణ కోరిన 47 డిమాండ్లను కేంద్రం పట్టించుకోలేదు. కేవలం మూడు రైల్వే స్పీడ్ కారిడార్‌లను ప్రకటించి, చేతులు దులుపుకుంది. ఆ కారిడార్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య రవాణాను వేగవంతం చేసేందుకు ఉద్దేశించినవి కావడం గమనార్హం.

*** బడ్జెట్‌లో తెలంగాణ కోరిన 47 డిమాండ్లు ఇవే..**

ఈ డిమాండ్లలో హైదరాబాద్ నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది.

*** కీలక ప్రాజెక్టులు – నిధుల అంచనా**

గోదావరిమూసీ అనుసంధానం: మూసీ నది ప్రక్షాళన మరియు పునరుజ్జీవనంలో భాగంగా గోదావరి జలాలను మూసీకి అనుసంధానించే ప్రాజెక్టు కోసం ₹6,000 కోట్లు కేటాయించాలని కోరింది.

మురుగునీటి మాస్టర్ ప్లాన్: హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మురుగునీటి వ్యవస్థను ఆధునీకరించేందుకు (Comprehensive Sewerage Master Plan) ₹17,212 కోట్లు కావాలని అభ్యర్థించింది.

మెట్రో రైల్ ఫేజ్ 2: హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ కోసం కేంద్రం తన వాటాగా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేసింది.


**విద్య మరియు మౌలిక వసతులు**

IIM హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (IIM) ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం కోరింది.

రవాణా వ్యవస్థ: రీజనల్ రింగ్ రోడ్ (RRR), రేడియల్ రోడ్ల విస్తరణతో పాటు రాష్ట్రంలో కొత్తగా 8 రైల్వే ప్రాజెక్టుల మంజూరుకు నిధులు ఇవ్వాలని విన్నవించింది. ఈ డిమాండ్లను కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ ప్రతిపాదనల్లో వాటికి నిధుల కేటాయింపు ఎంత చేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

## హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 202627 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు. వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు



కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు. నైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు.

## కాంగ్రెస్‌ను నిరుద్యోగులు ఛీకొడుతున్నారు: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని పీసీసీ చీఫ్ తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని చెప్పారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి ఫోటోలకు ఫోజు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో "రిక్రూట్ మెంట్ జీరో"గా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందన్నారు. పట్టుమని పదివేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని అనుకోవద్దని అన్నారు. ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటేనని పేర్కొన్నారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# ఆధ్యాత్మిక శోభితం.. రాగన్నగూడ యాగశాల

* **భక్తిశ్రద్ధలతో సాగిన సహస్ర చండీ మహా యాగం**
* **హాజరైన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి**

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 3 (భారత శక్తి): తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ ఆధ్యాత్మికతతో పునీతమైంది. శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మహారుద్ర సహిత సహస్ర చండీ మహా యాగం' మంగళవారం అత్యంత వైభవంగా కొనసాగింది. లోక కళ్యాణార్థం చేపట్టిన ఈ క్రతువును తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

* **భక్తి ప్రపత్తులతో ఎమ్మెల్యే పూజలు:**

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో పూర్ణాహుతి, ఇతర వైదిక కార్యక్రమాలను పీఠాధిపతులు, వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇలాంటి మహా యాగాల నిర్వహణ వల్ల సమాజంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు.



* **ఆధ్యాత్మిక చైతన్యం:**

యాగం నేపథ్యంలో రాగన్నగూడ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేద మంత్రోచ్ఛారణల మధ్య యాగశాల ప్రతిధ్వనించింది. నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. మల్రెడ్డి రంగారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఈ క్రతువులో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## కమిషనర్‌కు..
# టీజీఓఎస్ 2026 డైరీ అందజేత

* **సంఘం కార్యాలయానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి..**

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (భారత శక్తి) : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓఎస్) హైదరాబాద్ జిల్లా శాఖ డైరీ 2026 ఆవిష్కృతమైంది. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ను టీజీఓఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.బి. కృష్ణ యాదవ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నూతన సంవత్సర డైరీని కమిషనర్‌కు అందజేశారు.

* **సమస్యల పరిష్కారానికి విన్నపం:**

జిల్లాల్లో అధికారుల పనితీరు, సంఘం కార్యకలాపాలను కమిషనర్‌కు వివరించిన ప్రతినిధులు, టీజీఓఎస్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరారు.

* **ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు**

టీజీఓఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆశన్న, జిల్లా కార్యదర్శి ఎం.ఎ. ఖాదర్, కోశాధికారి ఎం.వి. రమణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యం: హైడ్రా రంగ ప్రవేశం

* **నగరవ్యాప్తంగా 'ఫైర్ సేఫ్టీ' పాఠాలు.. క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 03 (భారత శక్తి) : నగరంలో వరుసగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో భాగ్యనగర వాసులను అప్రమత్తం చేసేందుకు హైడ్రా నడుం బిగించింది. నాంపల్లి ఫర్నీచర్ షోరూం ప్రమాదం వంటి ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకున్న అధికారులు, నగరవ్యాప్తంగా భారీ స్థాయిలో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కేవలం నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు ఇవ్వడమే కాకుండా, ప్రాణ, ఆస్తి నష్టాలను ఎలా నివారించవచ్చో ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో మాక్ డ్రిల్స్:**

ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేందుకు వ్యాపారులకు నెల రోజుల గడువు ఇచ్చిన హైడ్రా, అదే సమయంలో శిక్షణపై దృష్టి సారించింది. పంజాగుట్ట, జూబ్లీహిల్స్, మాధాపూర్, గచ్చిబౌలి, దిల్సుఖ్‌నగర్ సహా నగరం నలుమూలల ఉన్న 30కి పైగా ప్రధాన కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.



**ముఖ్యమైన అంశాలు:**

సాంకేతికతపై అవగాహన: మంటలను గుర్తించే స్మోక్ డిటెక్టర్లు, ఆటోమేటిక్ వాటర్ స్ప్రింక్లర్లు, ఫైర్ ఎక్స్‌టింగిషర్లను ఎలా వాడాలో సిబ్బందికి వివరించారు.

అత్యవసర నిష్క్రమణ: ప్రమాదం జరిగినప్పుడు భయాందోళన చెందకుండా 'ఫైర్ ఎగ్జిట్' మార్గాల ద్వారా సురక్షితంగా బయటపడటంపై మాక్ డ్రిల్స్ నిర్వహించారు.

అప్రమత్తత: విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వర్తకులకు దిశానిర్దేశం చేశారు.

* **అత్యవసరమైతే ఈ నంబర్లకు ఫోన్ చేయండి!**

ప్రమాదం సంభవించినప్పుడు కాలాన్ని వృథా చేయకుండా తక్షణమే సమాచారం అందించాలని హైడ్రా సూచించింది.

ఫైర్ సర్వీస్: 101, హైడ్రా కంట్రోల్ రూమ్: 1070
వాట్సాప్/హెల్ప్‌లైన్: 90001 13667

నగరంలోని ప్రధాన కూడళ్లు, వాణిజ్య సముదాయాల్లో కార్మికులు, వ్యాపారులకు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించడం ద్వారా అగ్ని ప్రమాద రహిత హైదరాబాద్‌ను నిర్మించడమే లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.




# సిపిఐ చర్చలు సఫలం.. కాంగ్రెస్ కు మద్దతు

వనపర్తి జిల్లా, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): వనపర్తి మున్సిపల్ ఎన్నికల పొత్తుపై కాంగ్రెస్తో సిపిఐ జరిపిన చర్చలు సఫలమయ్యాయని, 33 వార్డుల్లో ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని సిపిఐ పట్టణ కార్యదర్శి జే రమేష్ అన్నారు. సిపిఐ ఆఫీస్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో 19, 21 వార్డులను సిపిఐ కి కేటాయించాలని జిల్లా కార్యదర్శి విజయరాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డికి వినతిపత్రం సమర్పించడం జరిగిందని, ఆ రెండు వార్డులకు నామినేషన్లు కూడా వేశామన్నారు. ఏఐసీసీ అబ్జర్వర్ విశ్వనాథన్, పశువర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, డిసిసి అధ్యక్షుడు మరో మారు పొత్తుల భాగంగా రెండు సీట్లు కేటాయించాలని కోరామన్నారు. ప్రతి వార్డులో కాంగ్రెస్ అభ్యర్థుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నందున వార్డులను కేటాయించలేమని, ప్రత్యామ్నాయంగా నామినేటెడ్ పోస్టులను ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అందువల్ల వనపర్తి పట్టణం అన్ని వార్డుల్లో సిపిఐ కాంగ్రెస్కు మద్దతు ఇచ్చేందుకు నిర్ణయించిందని, పట్టణ ప్రజలు కాంగ్రెస్కు ఓటు వేసి వార్డు సభ్యులను గెలిపించాలని కోరారు. సిపిఐ సీనియర్ నేత కళావతమ్మ, పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణ, డి శేఖర్ ,జయమ్మ, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీ పై
# కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం

* **ఎనిమిది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుంది.**
* **వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి.**

వనపర్తి జిల్లా, ఫిబ్రవరి 3 (భారత శక్తి ప్రతినిధి): ప్రస్తుతం జరుగుతున్న మునిసిపాలిటీ ఎన్నికల్లో వనపర్తి, పెబ్బేరు మునిసిపాలిటీ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి భీమా వ్యక్తం చేశారు.మంగళవారం వనపర్తి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కొత్త కాపు శివసేనారెడ్డి, చిన్నారెడ్డి గార్ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు బీఫాములను అందజేశారు.వనపర్తి పట్టణంలోని 33 వార్డులలో 33 వార్డులు. పెబ్బేరు మున్సిపాలిటీలోని 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే అఖండ విజయం సాధిస్తారని ఆయన అన్నారు. ప్రజలు ప్రతిపక్షాలు నమ్మే పరిస్థితిలో లేరని, గత పదివేల కాలం కేవలం ప్రతిపక్ష నాయకులే బాగుపడ్డారు తప్ప ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని నేటి ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అందుతున్నాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున బీఫాంలో పొందిన ప్రతి కౌన్సిలర్ అభ్యర్థులందరినీ గెలిపించి తీరుతామని మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీని కైవసం చేసుకుంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డితో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు ఆయన బీఫాంలో పంపించేశారు.



ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మణుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, నాగోల్ డివిజన్ పరిధిలోని ఫతుల్లాగూడ నందుభారాస పాలనలో 58 జీఓ క్రింద కొందరికి పట్టాలు మంజూరు చేయడం జరిగిందని, ఇంకా కొంతమందికి పట్టాలు రాలేదని,రాని వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అక్కడ పేద ప్రజలు దాదాపు 70-80 గజాల ఇండ్లలో నివాసం ఉంటున్నారని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, తమ యొక్క సిబ్బందిని పంపించి ఎంక్వయిరీ చేసిన తరువాత అక్కడ పట్టాలు రాని వారికి పట్టాలు ఇప్పించడం జరుగుతుంది అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి పాల్గొన్నారు. ఎల్బీనగర్, ఫిబ్రవరి 03 (భారత శక్తి ):

## శంకర్‌పల్లి మున్సిపాలిటీలో
# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం

మహేశ్వరం, ఫిబ్రవరి 03 (భారత శక్తి): శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ఖచ్చితంగా జాతి పితామహుడని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను విమర్శించడమే తన పనిగా పెట్టుకున్నారని, అసలు పాలనపై దృష్టి లేదని ఆరోపించారు. స్కాంలను బయటపెడితే నోటీసులు జారీ చేస్తూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గత రెండేళ్లుగా పట్టణాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఎలాంటి అభివృద్ధి కనపడటం లేదని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలతో పాటు, చెప్పనివి కూడా అమలు చేశారని గుర్తుచేశారు.మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పాలని



ప్రజలకు పిలుపునిచ్చారు. నాలుగు వేల రూపాయల పెన్షన్ రావాలంటే కారు గుర్తుకు ఓటు వేయడమే మార్గమని స్పష్టం చేశారు.ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని ఆరోపించారు. కేసీఆర్ పాలనలోనే నిజమైన అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ హయాంలో మాత్రం ఎలాంటి పురోగతి లేదని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నోటీసులు ఇచ్చి ప్రజలను, నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.